# మిసిమి


మాస పత్రిక

సెప్టెంబర్ 2008




రూ. 8/-

చిత్రకారుడు : కాండిన్స్కీ (1866-1944)





Several Circles



ఇంద్ర ధనుస్సు-1909

# మిసిమి

**"All that we are is the product of what we have thought"**
**is "We are what we think." - Dammapada.**


సంపుటి 19 | సెప్టెంబర్ 2008 | సంచిక 9

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**


## విషయ సూచిక


| | |
|---|---|
| యాత్రికుడు భుజంపైన ఎక్కువ బరువు ఉంచుకో కూడదు | మూలం : రాజేంద్ర శాహ్<br>అనువాదం : డా॥ జె. లక్ష్మిరెడ్డి |
| ఎడారి సూర్యుడు (సౌరశక్తి వినియోగంలో నూతన ప్రయోగం) | డా॥ కె. లక్ష్మీనారాయణ |
| ఆమూర్త చిత్రకళకు ఆది గురువు - కాండిన్స్కి | కాండ్రేగుల నాగేశ్వరరావు |
| సమాజ సంకీర్ణతల మధ్య బౌద్ధం విస్తరిస్తుందా? | ముంగర జాషువ |
| వినిర్మాణ నిర్మాత జాక్ డెరిడా | శివలింగం |
| విశ్వనాథ - సౌందర్య జిజ్ఞాస | డా॥ యు. ఎ. నరసింహమూర్తి |



విడిప్రతి రూ. **8/-** | వార్షిక చందా రూ. **100/-** | విదేశీయులకు **$ 20**

ముఖచిత్రం : **మొట్టమొదటి ఆమూర్త చిత్రం**

చిత్రకారుడు : **కాండీన్స్కి**

Printed & Published by **Bapanna Alapati,** at Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimi@kalajyothi.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# HOW TO BUILD A FREE AND EGALITARIAN SOCIETY

- K.Satchidananda Murty

Practice of nairatmya-darsana (The philosophy of selflessness), according to Santharakshita, leads to the recognition of the samya (sameness) of all. At another place Kamalasila expresses the following idea: Some people due to their genetic endowment are by their nature inclined to delight in doing good to others. They, distressed at seeing the suffering world, out of compassion *abandon concern for themselves and realising all transmigrating beings as themselves,* resolve to protect them all. *Svâtmani vyapek°amapâsya sakalâneva samsâriða âtmatvenâbhyupagatâh.*

Kamalasila is able to say that compassion can cause the giving up of self-concern and the realisation of all others as oneself, because, according to Buddhist thinkers, there are no separate substantial individual selves. In this organically interrelated world there are beings, but each does not have its own permanent intrinsic nature (svabhâva). So nothing like a self identity separates fellow beings, all of whom, moreover are in the same existential situation, constituted by birth, death, suffering and evanescent pleasure. Every being is therefore as much another as itself. Nairatmya makes it possible for one to be concerned for others as for oneself, and not as for others; for others area s much oneself as one is. If this ontological truth is known and accepted with its implications, self-centeredness will be found to be absurd. If a sufficient number of people imbued with such a philosophy live accordingly, it should be easy to build a free, self-corrective and egalitarian society.

*Sent by* T.Ravi Chand

---

*Excerpt from Lal Mani Joshi Memorial Lecture Delivered by Proof. K.S. Murthy on 24th Sept., 1984*



రాజేంద్ర శాహ్ (1913)

# యాత్రికుడు భుజంపైన ఎక్కువ బరువు ఉంచుకోకూడదు



2001వ సం॥ జ్ఞానపీఠ్ పురస్కార స్వీకారోపన్యాసం

(గుజరాతీ నుండి హిందీలోకి అనువదించబడిన ఉపన్యాసానికి తెలుగు అనువాదం)

అనువాదం : డా॥ జె. లక్ష్మిరెడ్డి

ఈ రోజు భారతీయ జ్ఞానపీఠ పురస్కారోత్సవ సమయంలో నేనేమైనా చెప్పవలసి ఉంటే, ఈ భూమిపైన నేను కేవలం ఒక యాత్రికుణ్ణి, ప్రయాణీకుణ్ణి అని మాత్రమే చెప్పగలను. నేను ఒక తీర్థస్థానం నుండి మరో తీర్థస్థానం దాకా విహరిస్తూ ఉంటాను. వస్తాను, పోతాను, మళ్ళీ వస్తాను, ఇలా. దారిలో ఇతర యాత్రికులు ఎవరు కనిపించినా వారితో సామరస్యం ఏర్పరచుకుంటాను, మనిషి నుండి, పశుపక్ష్యాదుల నుండి, ప్రకృతి నుండి ఈ సృష్టిలోని ప్రతి అణువు నుండి, చెట్లు-మొక్కల నుండి, నేను సంగీతం వింటాను, వాటి స్వరంతో నా స్వరం కలుపుతాను. ప్రకృతి సాన్నిధ్యం నుండి వెలువడిన ఆ సంగీతమే నా కవిత్వం, అదే నా ఆవాగమనాల రాగ-రాగిణి కూడా.

ఈ పురస్కారం ఈ తీర్థస్థానం యొక్క ప్రసాదంగానే నాకు లభ్యమైంది. ఇక ప్రసాదం ఎప్పుడేగానీ ఒంటరిగా ఆరగించేది కాదు. దాన్ని జ్ఞానం లాగా పంచిపెడుతూనే ఉండాలి. ప్రజా హితాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ పురస్కారం ద్వారా లభించే ధనరాశిని ఒక సాంస్కృతిక ట్రస్టుకు అర్పించే సంకల్పాన్ని నేను ఇంతకు మునుపే ప్రకటించాను.

నా గురించి ఏమైనా చెప్పవలసి వస్తే నేను చెప్పగలిగింది ఇంతే. ఇక జీవితంలో నాకు లభించిన మంత్రం ఇది—

యాత్రికుడు భుజంపైన ఎక్కువ బరువు ఉంచుకోకూడదు. పరిగ్రహం శ్రమ కలిగిస్తుంది. మోసే బరువు ఎంత తక్కువ ఉంటే, యాత్ర అంతే సులువుగా, సహజంగా, అనుకూలంగా సాగుతుంది. అందరినీ కలుసుకోవాలి—కానీ, బంధన రహితంగా ఉంటూ.

నా హృదయంలోని భావం ఇది. ఈ తీర్థ స్థానం ఒడ్డున నిలబడిన ఈ రోజు ఇంకేమి చెప్పగలను...?

**జీవితవిశేషాలు, సాహిత్య పరిచయం :**

గుజరాతీ సాహిత్యానికి ఉమాశంకర్ జోషి, పన్నాలాల్ పటేల్ తర్వాత మూడవ జ్ఞానపీఠ పురస్కారం తెచ్చిపెట్టిన ఘనత పొందిన రాజేంద్ర శాహ్ స్వాతంత్ర్యోత్తర యుగంలోని ప్రముఖ

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి, బి-1/93, జనక్‌పురి, న్యూఢిల్లీ-110 058

గుజరాతీ కవుల్లో ఒకరు. ఆయన కవితా యాత్ర గుజరాతీ సాహిత్యంలో గాంధీ యుగం నడుస్తున్న రోజుల్లో 20 వ శతాబ్దం నాల్గవ దశకం నుండి మొదలైంది. ఆ రోజుల్లో గాంధీజీ ద్వారా ప్రభావితుడు కాని రచయిత అంటూ లేడంటే అతిశయోక్తి కాదు. అనేక మంది రచయితలు గాంధీజీ నాయకత్వంలో చెలరేగుతూండిన స్వాతంత్ర్య పోరాటంలో ప్రత్యక్షంగానే పాల్గొని సత్యాగ్రహులై జైలుశిక్ష అనుభవించారు. రాజేంద్ర శాహ్ కూడా అలాంటి రచయితే.

రాజేంద్ర శాహ్‌కు ముందుండిన గుజరాతీ కవుల్లో సుందరమ్ (1908-1991), ఉమాశంకర్‌జోషి (1911-1988) ప్రముఖులు. వీరిద్దరి తరానికే చెందిన కవి అయినా శాహ్ కవితా రచన కొంత ఆలస్యంగా ఆరంభమైంది. మొదటి నుండి ఆయన కవిత్వంలో ప్రకృతి, ప్రేమ, సౌందర్యం, అధ్యాత్మం వీటి చక్కటి సమన్వయం ఉంటూ వచ్చింది. ఈ సమన్వయం తర్వాతి రచనల్లో కూడా అనేక రూపాల్లో మనకు కనిపిస్తుంది. తన సుదీర్ఘ జీవితపు రెండో భాగంలో ఆయన యోగమార్గం వైపు కూడా పయనించారు. కబీరులాగా యోగానుభవాల గురించిన రచనలు కూడా చేశారు.

రాజేంద్ర శాహ్ మొదటి కవితా సంపుటి 'ధ్వని' (1951) గుజరాతీ కవితా చరిత్రలో కొత్త యుగాన్ని ఆవిష్కరించింది. గాంధీ యుగం తర్వాత ఈ కాలాన్ని విమర్శకులు 'రాజేంద్ర-నిరంజన యుగ'మని అన్నారు. వయసులో చిన్న వాడయినప్పటికీ నిరంజన భగత్ (1926) కవితా రచన రాజేంద్ర శాహ్‌తో సమాంతరంగా సాగింది. పాశ్చాత్య కవిత్వంతో, కవితా సిద్ధాంతాలతో ప్రభావితుడైన నిరంజన్ భగత్, రాజేంద్ర శాహ్ రాసిన చింతనాత్మకమైన, ప్రతీకలతో కూడిన కవితలకు స్వాగతం పలికారు. టి.యస్.ఇలియట్, ఆయన సమకాలీన ఇంగ్లీషు కవితాధార, నవ్య విమర్శ, వీటి ప్రభావం ఆనాటి గుజరాతీ కవిత్వం పైన, విమర్శ పైన మనకు కనిపిస్తుంది.

రాజేంద్ర శాహ్ విభిన్న రూపాల కవిత్వం రాశారు. కానీ, గేయం, సానెట్ లాంటి కవితా రూపాలు, సంస్కృత ఛందస్సులో రాసిన దీర్ఘ రచనలు ప్రధానంగా చెప్పుకోదగ్గవి. ఆయన ఒక వైపు ఛందోబద్ధ కవితలు రాస్తూ మరో వైపు ప్రజల పెదాలపైన నడయాడే గేయాలు కూడా రాశారు. శ్రేష్ఠ కావ్య గుణాల కారణంగా ఆయన గీతాలు రవీంద్రనాథ్ ఠాగూరు గేయాలను తలపుకు తెస్తాయి. కిశోరావస్థ నుండే రాజేంద్ర శాహ్ ఒక విశిష్ట తాత్త్విక ఆలోచనా ధోరణికి చేరువయ్యారు. తాత్త్వికతతో పరిచయం పొందిన తర్వాత, తత్త్వశాస్త్రం చదివినప్పుడు అది మరింత పరిష్కృతమైంది. పరిశోధనా విద్యార్థిగా ఆయన జర్మన్ తాత్త్వికుడు కాంట్ ఆలోచనాధోరణితో ప్రభావితులయ్యారు. అయినా ఉపనిషత్తుల్లోని చింతన ఆయన దైనందిన జీవితంలో విడదీయరాని భాగంగా ఉండిపోయింది.

రాజేంద్ర శాహ్ రచించిన అనేక సానెట్లలో, సానెట్ శృంఖలలో శ్రేష్ఠమైన కవిత మనకు దర్శనమిస్తుంది. 'ఆయుష్య నా అవశేషే' (ఆయువు అంతిమ సమయంలో) లోని సానెట్ శృంఖల, బింబాలు, ప్రతీకలు, అందులో వ్యాపించి ఉన్న జీవన దృష్టి, కవి రాజేంద్ర శాహ్ లబ్ధి మాత్రమే కాదు, గుజరాతీ కవితా లబ్ధి కూడా.

వస్తువు దృష్టితో చూసినా ఆయన గేయాల్లో అపారమైన వైవిధ్యం ఉంది. జానపద గేయాల లయ ఆధారంగా రచించిన గేయాలే కాక అనేక భారతీయ భాషల గేయాల లయలు కూడా అందులో మనకు దొరుకుతాయి. రాజస్థానీ, బ్రజభాష, రెండింటి కవితా సంప్రదాయాల ప్రతిధ్వని కూడా ఆయన గేయాల్లో మనం వినవచ్చు.

ప్రణయం, ప్రకృతి, అధ్యాత్మం ఆయన కవిత్వ కేంద్రంలో ఉంటూ వచ్చాయి. ప్రణయ సంబంధమైన ఆయన కవితల్లో వేగంతో పాటు సంతృప్తి కూడా ఉంది. ప్రసన్న మనస్కుడైన ఈ కవి నుండి ప్రణయ విఫలత, లేక ప్రణయ వ్యాకులతతో కూడిన రచనలను ఆశించలేం. తన వ్యక్తిగత జీవితంలో కవి ఏ ఉల్లసిత ప్రేమానుభూతి పొందాడో, ఆ ప్రసన్నభావమే కవిత్వంలో కూడా అభివ్యక్తి పొందింది. ఆయన ఒక కవితా శీర్షికనే తీసుకొని చెప్పాలంటే ప్రణయం యొక్క 'బారామాసీ' (అన్ని ఋతువుల్లోనూ వికసించే పువ్వు) ఈ కవితల్లో ఉంది. గత ఐదు దశాబ్దాలుగా రాజేంద్ర శాహ్ కవితా యాత్ర నిరంతరం ముందుకు సాగుతూ వచ్చింది.

1913 జనవరి 28న జన్మించిన రాజేంద్ర శాహ్ బరోడాలోని ఎమ్.ఎస్.విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రులయ్యారు. వీరు 24 కవితా సంపుటాలు వెలువరించారు. వీటిలో 'శాంత కోలాహల్', 'మధ్మమ', 'చందన్ భీనీ అనామిక' మొదలైనవి చాలా ప్రసిద్ధి పొందాయి. ఈ మౌలిక రచనలే కాక శాహ్ సంస్కృతం నుండి జయదేవుని గీతగోవిందాన్ని, ఇంగ్లీషు నుండి దాంతే మహా కావ్యం 'Divine Comedy' ని, వాల్ట్ విట్‌మన్ రచించిన 'Leaves of Grass' లోని కొన్ని కవితలను గుజరాతీలోకి అనువదించారు.

వీరు పొందిన అనేక పురస్కారాలు, బిరుదుల్లో కొన్ని : 'కుమారచంద్రక్' (1947), రణజీత్ రామ్ సువర్ణ చంద్రక్ (1956), సాహిత్య అకాడెమీ పురస్కారం (1964), నర్మద చంద్రక్ (1977), ధన్‌జీ కాన్‌జీ సువర్ణ చంద్రక్ (1983), ఆది కవి నరసింహ్ మెహతా పురస్కారం (1999), కేంద్ర సాహిత్య అకాడెమీ వీరికి 1999లో తన మహత్తర సభ్యత్వం (fellowship) ఇచ్చి సత్కరించింది. భారతీయ సాహిత్యాన్ని గొప్పగా సుసంపన్నం చేసినందుకు 37వ జ్ఞానపీఠ పురస్కారం పొందారు (2002).

## ఇంటర్వ్యూ

ప్ర : కావ్య సృజనకు మీకు ప్రేరణ ఎలా కలిగింది?

జ : 1929 నాటిమాట, ఒక సాయంత్రం నేను వ్యాయామశాలకు వెళ్తున్నాను. దారిలో ఇద్దరు మిత్రుల ఇళ్ళుండేవి. వెళ్ళి టైమయింది, బయలుదేరండన్నాను. "ఛందశాస్త్రం చదువుతున్నాం, ఈ రోజు రాలేం" అన్నారు. అప్పుడు నేను మొదటి సారిగా 'ఛందశాస్త్రం' అనే మాట విన్నాను. అప్పుడే తెలిసింది నాకు, కవిత్వం రాయడానికి ఛందశాస్త్రం చదవాలని. ఒంటరిగా వ్యాయామశాలకు వెళ్తూ

దారిలో "నేను కవిత్వం రాయలేనా?" అని ఆలోచించాను. ఈ విధంగా కవిత్వం రాయాలనే ఆలోచన నాకు మొదటిసారి కలిగింది.

ఆ తర్వాత నవరాత్రాల్లో వీధిలో గుజరాతీలు పాడే 'గర్బాలు' విని మా ప్రసిద్ధ కవి న్హానాలాల్ ధోరణిలో 'రాస్' గీతాలు రాయడం ఆరంభించాను. అప్పట్లో ఇది కేవలం "కావ్య క్రీడ" అని మాత్రమే భావించాను. అప్పటికి న్హానాలాల్ కవితలు, నాటకాలు చాలా ప్రచారంలో ఉండేవి. అందువల్ల నేను గ్రంథాలయానికి వెళ్ళి న్హానాలాల్ కవితా సంపుటలు, ఇతర పుస్తకాలు చదవడం మొదలు పెట్టాను. నేను పాఠ్యగ్రంథాలు కాక ఇతర పుస్తకాలు చదవడం ఈ విధంగా మొదలైంది.

1930లో 'ఉష' అనే కవిత రాశాను. అప్పుడు నేను మెట్రిక్‌లో ఉన్నాను. ఈ కవిత మా స్కూలు పత్రిక సంవత్సర సంచికలో అచ్చయింది. ఆ తర్వాత 1933లో ముంబాయిలోని విల్సన్ కాలేజీలో చదువుకుంటున్నప్పుడు ఒక గేయం రాశాను. అది కూడా కాలేజీ పత్రిక 'విల్సోనియన్'లో అచ్చయింది. దానికి మాడర్న్ హైస్కూలు ప్రిన్సిపల్ రమణ వకీల్ అభినందన కూడా లభించింది.

ఆ తర్వాత 1940వరకు నిరంతరంగా రాస్తూ వచ్చాను. అయితే ఆ కాలంలో రెండు కవితలు మాత్రమే అచ్చయాయి. నాకు సంతృప్తి కలిగితే తప్ప నేను ఏ కవితనూ పత్రికలకు పంపేవాణ్ణి కాదు. పైగా 'కుమార్' (ఉచ్ఛ్యస్థాయికి చెందిన పత్రిక)లో అచ్చు కాగలిగిన కవిత రాయాలనే సంకల్పం కూడా ఉండేది. ఈ మధ్య కాలంలో కాలేజి పత్రికలో కొన్ని కవితలు అచ్చయాయి. అంతే, ఇవి తప్ప నేను నా కవితలేవీ పత్రికలకు పంపలేదు. ఆ కాలాన్ని రచనకు నన్ను సిద్ధం చేసుకునే కాలంగానే నేను భావించాను.

ప్ర : మీ వ్యక్తిత్వ నిర్మాణంలో ప్రధానంగా ఎవరెవరి, ఏ ఏ గ్రంథాల పాత్ర ఉంది?

జ : ఒకరు మా అమ్మే. రెండవ వారు నా గురుదేవులు శ్రీమద్ ఉపేంద్రాచార్య, మూడవ వారు చంపా పిన్నమ్మ. ఆమె మా అమ్మ స్నేహితురాలు. ఇద్దరూ శ్రేయస్సాధక అధికారి వర్గావలంబులు. మా అమ్మ రోజూ రాత్రి నిద్రపోయే ముందు మహాభారతం, రామాయణం, శ్రేయస్సాధక అధికారి వర్గం వారి కథలు చదివి వినిపించేది. నా సంస్కారాల పునాది ఇలా ఏర్పడింది.

ఇక నా సంస్కారాలకు బలం చూకూర్చడంలో మూడు ఊళ్ళ వాతావరణం పాత్ర కూడా ఉంది. మేము కపడ్‌వంజ్‌లో ఉండే వాళ్ళం. శ్రీమద్ ఉపేంద్రాచార్య వడోదరాలో ఉండేవారు. నేను ఉన్నత విద్యకోసం ముంబయి వెళ్ళాను. ఈ విధంగా ఈ మూడు ఊళ్ళ వాతావరణం నా ఎదుగుదలకు తోడ్పడింది. కపడ్‌వంజ్‌లోని గ్రామీణ వాతావరణం, వడోదరాలోని సాంస్కృతిక వాతావరణం, ముంబయిలోని నగర వాతావరణం, మూడింటి పాత్ర నా విద్యాభ్యాసంలో, నా వ్యక్తిత్వ నిర్మాణంలో ఉంది.

పాఠశాలలో చదువుకునే రోజుల్లో నేను రామాయణం, మహాభారతం, 'యోగినీ కుమారి', 'భామినీ భూషణ్' 'వీర దుర్గాదాస్' తర్వాత నృసింహాచార్య రచనలు, శ్రేయస్సాధక్ అధికారి వర్గం వారి రచనలు వినడం, చదవడం జరిగింది. ఆ తర్వాతి కాలంలో కవి న్హానాలాల్, సుందరమ్, ఉమాశంకర్, శ్రీధరాణి, వీరి కవితా సంపుటాలు ఆనందంగా చదివాను. ఆ తర్వాత 'కుమార్'లో వెలువడే కవితల పట్ల ప్రత్యేకమైన ఆసక్తి కలిగింది.

వడోదరా కాలేజీలో చేరిన తర్వాత పాశ్చాత్య తత్త్వశాస్త్రం చదువుతూ అరిస్టోటల్, ప్లేటో, దేకార్తే, కాంట్, మొదలైన వారిని కూడా ఆసక్తితో చదివాను.

మా అమ్మ నేను ఎలాంటి పుస్తకాలు చదువుతున్నాను, నా మిత్రులు ఎలాంటి వారు, అనే వాటిని శ్రద్ధగా గమనిస్తూ ఉండేది. స్కూల్లో చదువుకునే రోజుల్లో ఒకసారి నేను కలాపి కవితా సంపుటి 'కలాపి కే కారవం' తీసుకొచ్చాను. అందులోని 'అబ్బా...అమ్మో...అయ్యో!'లతో కూడిన నిరాశ, నిస్పృహ పుట్టించే కవితలు ఆమెకు నచ్చలేదు. ఆమె నిరాశాభరితమైన కవితలు చదవ వద్దని చెప్పి ఆ పుస్తకం వెనక్కిచ్చి రమ్మని చెప్పింది. నా జీవన దృష్టి నిర్మాణంలో ఆమె పాత్ర చాలా ఉంది.

**ప్ర : సౌందర్యానురాగం మీ కవిత్వంలోని ప్రధాన లక్షణం. ఈ సౌందర్యానురాగ సంస్కారం మీకు ఎలా అబ్బింది?**

జ : కపడ్‌వంజ్‌లో మేము మూడంతస్తుల ఇంట్లో ఉండే వాళ్ళం. అంత పెద్ద ఇంట్లో మేమిద్దరమే, అమ్మ, నేను. నా మనసులో నుంచి భయం పోగొట్టడానికి మా అమ్మ నన్ను చీకట్లో కొన్ని వస్తువులు తీసుకురావడానికి మూడో అంతస్తులోకి పంపేది. లాంతరు లేకుండా పోవాలి! చిన్న వయసు! భయమేసేది. అయితే క్రింది నుంచి అమ్మ నాపేరు పిలుస్తూ ఉండేది. అప్పుడు నేను ఆమె చెప్పిన వస్తువులు పై నుంచి తెచ్చేవాణ్ణి. వస్తువులన్నీ వాటి స్థానంలో క్రమపద్ధతిలో ఉంచినప్పుడే కదా, చీకట్లో త్వరగా దొరుకుతాయి? అందువల్ల చిన్నప్పటి నుంచి వస్తువులన్నీ ఒక పద్ధతిలో ఉంచడం నాకు అలవాటైంది.

స్కూల్లో ఉన్నప్పుడే వ్యాయామశాలకు పోతూ ఉండడం వల్ల చిత్రకారుడు సోమాలాల్ శాహ్‌తో స్నేహమైంది. మొదట్లో ఆయనతో నేను చిత్రకళ నేర్చుకునేవాణ్ణి. ఆ కళలో అవసరమయ్యే సమతూకం, సామంజస్యం (balance and harmony) విషయం తెలిసి రావడం మొదలైంది. ఆయన ప్రకృతి దృశ్యాలు (landscapes) చిత్రించడానికి బాగుడ్ వెళ్ళినప్పుడు నేనూ వెంట వెళ్ళేవాణ్ణి. అప్పుడు బయట కనిపించే దృశ్యంలో నుంచి ఆయన ఏమి తీసుకున్నాడు, ఏమి వదిలేశాడు, అనేది చూస్తూ ఉండేవాణ్ణి. దీనివల్ల నాకు balance అనేది తెలిసి వచ్చింది. నా దృక్పథం స్పష్టమవుతూ వచ్చింది.

శ్రేయస్సాధక అధికార వర్గం వాళ్ళ ఉత్సవాల్లో ఆలయ అలంకారణ చాలా అందంగా ఉండేది. వాతావరణమంతా రమణీయంగా తయారయేది. అక్కడి ఉపన్యాసాలు, కీర్తనలు, వీటన్నింటి వల్ల మనసుకు ఒక విధమైన శాంతి కలిగేది. ఇతర దేవాలయాలలాగా ఇక్కడ కోలాహలం ఉండేది కాదు. ఈ శాంతి అనుభవం నాకు అన్ని పనుల్లో శాంతి యొక్క సమతూకమే ఉంటుందనీ, అది ఉండాలనీ తెలిసింది. కపడ్‌వంజ్ చుట్టుపక్కల ఉన్న ప్రకృతి సౌందర్యం కూడా నా చైతన్యం పైన చాలా లోతైన సంస్కారాల ముద్ర వేసింది. మా అమ్మ, సోమాలాల్ శాహ్, శ్రేయస్సాధక వర్గ ఆలయం, కపడ్‌వంజ్ ప్రకృతి సౌందర్యం నా సౌందర్య దృష్టి వికసించడానికి కారకాలు. ముంబాయిలో ఉంటున్న రోజుల్లో 14X10, 14X6 అడగుల రెండు గదుల్లోని వస్తువుల అమరికను చూసి చున్నీలాల్ మడియా దాన్ని గురించి ఒక వ్యాసం కూడా రాశారు.

**ప్ర : మీ కవిత్వంలోని భాషకు సంస్కృత తత్సమ పదాల వల్ల ఒక లక్షణిక భంగిమ వచ్చింది. గాఢమైన ఈ సంస్కృత భాషాస్పర్శ మీ కవితా భాషకు ఎలా కలిగింది?**

జ : నృసింహాచార్య రచనలు, ఉపనిషత్తులు, తంత్రసాహిత్యం చదవడం వల్ల ఇది వచ్చింది. ఈ గ్రంథాలు చదివేప్పుడు ఒక ప్రత్యేకమైన పదజాలంతో పరిచయమయ్యే అవకాశం కలిగింది. కవిత్వం రాసేప్పుడు ఆ పదాలు అవసరమైన చోటంతా సహజంగానే ప్రయోగించబడుతూ వచ్చాయి. పదాలు తమ ప్రత్యక్ష అర్థం తర్వాత తమ సంప్రదాయ అర్థచ్ఛాయను తీసుకొస్తాయి. సాంస్కృతిక సంప్రదాయంతో మన సంబంధం ఇప్పుడు తెగిపోయింది. అందువల్ల ఈ పదాలు అర్థం కాకుండా పోయాయి.

**ప్ర : మీరు బెంగాలీ బాష ఎలా నేర్చుకున్నారు?**

జ : నేను కాలేజీ చివరి రోజుల్లో ఉన్నప్పుడు మా ఇంట్లో క్రింది వాటాలో ఒకాయన ఉండేవాడు. ఆయన నాకు బెంగాలీ లిపి నేర్పించాడు. ఆ తర్వాత నా అంతకు నేనే బెంగాలీ పుస్తకాలు చదవడం మొదలు పెట్టాను. ఈ విధంగా బంకిమ్ చంద్ర 'ఆనందమఠం', రవీంద్రనాథ్ సాహిత్యం, బుద్ధదేవ బసు రచనలు చదివేశాను. ఒకసారి కవి ఉమాశంకర్ జోషి కలకత్తాలో బుద్ధదేవ బసుతో కలిసినప్పుడు ఆయన అన్నాడట, "మీ గుజరాత్‌కు నా పుస్తకాల ఒక ప్రతి ఎప్పుడూ, పోతూ ఉంటుంది. అక్కడ రాజేంద్ర శాహ్ అనే ఒక వ్యక్తి ఉన్నాడు. ఆయన ఒక ప్రతి తెప్పించుకుంటూ ఉంటాడు" అని.

**1942-43**లో ఉత్కంఠేశ్వర్‌లో ఆశ్రమం నెలకొల్ప బడిన తర్వాత అందులో గ్రంథాలయంలో నుంచి ఉపనిషత్తులతో పాటు బెంగాలీ తంత్రవిద్యకు సంబంధించిన పుస్తకాలు కూడా తీసుకొని చదివాను. అప్పుడు తంత్రవిద్య రహస్యాలు కొంత తెలిసి వచ్చాయి.

**ప్ర : అనేక ఛందస్సులను మీరు గొప్పగా ప్రయోగించారు. ఛందశ్శాస్త్రాన్ని మీరు ఎలా అభ్యసించారు?**

జ : ఎక్కడా అభ్యసించలేదు. శ్రేయస్సాధక అధికారి వర్గ ఆలయంలో పాడే ప్రార్థనల నుంచి, కవితల నుంచి నాకు ఛందస్సు సంస్కారాలు సహజంగానే అబ్బాయి. సంస్కృత ఛందోబద్ధ రచనలు ప్రార్థనల రూపంలో పాడడం నాకు అలవాటే.

**ప్ర : కవితా రచన ఆరంభంలో మీ పైన ఎవరెవరి ప్రభావం పడింది?**

జ : మొదట్లో ఉపేంద్రాచార్య, న్హానాలాల్ ప్రభావం పడింది. ఆ తర్వాత ఉమాశంకర్ జోషి సుందరం, శ్రీధరాణి, కవితలు నన్ను ప్రభావితం చేశాయి. ఆ తర్వాత కాలేజీ రోజుల్లో ఇంగ్లీషు కవులు వర్డ్స్‌వర్త్, టెనిసన్, శెల్లీ, మిల్టన్, బ్రౌనింగ్, మొదలైన వారి రచనలు చదివాను. అప్పుడు ఒక కొత్త ప్రపంచమే నా ఎదుట తెరుచుకుంది. వీటన్నింటి రసాయనంలో నుంచి కొంత కొత్త రచన వెలువడడం మొదలైంది.

ప్ర : సమకాలిక సంఘటనలు మీ కవిత్వంలో అంతగా ప్రతిబింబించక పోవడానికి కారణమేమిటి?

జ : జీవితంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. వాటి మధ్యలోంచి ఒక నిశ్చితమైన దిశగా జీవితాన్ని మనం తీసుకు పోవలసి ఉంటుంది. మరో దిశగా జీవితాన్ని తీసుకు పోవడం సాధకుడు చేయకూడదు. మన చుట్టు ప్రక్కల రాగద్వేషాలకు సంబంధించిన సంఘటనలు ఎన్నో జరుగుతూ ఉంటాయి. వాటిని కీర్తిస్తూ ఉండడం కంటే సాధనలో లీనమై ఉండడం మంచిది. అశుభాన్ని గురించి కాక, శుభాన్ని గురించి మాట్లాడుతూ ఉన్నప్పుడు కలిగే స్పందనలు మనకు, ఇతరులకు అందరికీ ఉపయోగకరంగా ఉంటాయి.

జీవితం పట్ల ఇలాంటి దృష్టి నాకు సహజంగానే ప్రాప్తించింది. సహాయ నిరాకరణోద్యమంతో నాకు సంబంధం ఉండేది. అయితే అది నా కర్తవ్యక్షేత్రం. సాధనా క్షేత్రం కాదు. అప్పటి సామాజిక పరిస్థితులు చూసినప్పుడు కలిగిన విషాదం 'విషాదనే సాద్' లాంటి కవితల్లో వ్యక్తమైంది. ఈ మధ్యనే వచ్చిన నా కవితా సంపుటి 'హా...హుఁ...సాక్షీ భుఁ'లో సంకేత రూపంలో సామాజిక పరిస్థితి వ్యక్తమైంది. అక్కడక్కడ ప్రబోధ రూపంలో కూడా వచ్చింది.

కవిత్వం నేను సాధించదలచుకున్నది కాదు, నేను వెళ్ళదలచుకున్న ఆధ్యాత్మ మార్గానికి అది ఒక సాధనం. కవిత్వమే సుఖదుఃఖాల్లో నన్ను సమస్థితిలో ఉంచింది. అందువల్లనే అది నాకు నిజమైన చెలి.

ప్ర : మీ దృష్టిలో సృజన ముఖ్య ఉద్దేశ్యం ఏమిటి?

జ : సృజనలో బాధ్యతాభావం వచ్చినప్పుడు అహంకారం తనంత తానే ప్రవేశిస్తుంది. అప్పుడు అందులో అంత భాగం వరకు దాని శుద్ధత్వం సురక్షితంగా ఉండదు. అందువల్ల నిరపేక్షమైన సృజన జరగాలి. సృజనలోని ఆనందం ఆత్మాభివ్యక్తిలోని ఆనందమే. ప్రతిప్రాణి శక్తి కొద్దీ తన్ను వ్యక్తీకరించుకునే ప్రయత్నం చేస్తుంది. నిరభిమాన రూపంలో ఆ అభివ్యక్తి జరిగినప్పుడు దానికి సహజమైన ఆనందం కలుగుతుంది. అందువల్ల సృజన 'నేను'లో నుండి కాక ద్రష్ట భావంతో, అంటే సాక్షీ భావంతో జరగాలి.

ప్ర : మొదట కొద్దిగా కథలు, ఏకాంకికలు రాసిన తర్వాత గద్య ప్రక్రియల్లో మీరు ఎక్కువగా రాయలేదు. కారణం?

జ : కథల్లాంటివి రాయడానికి ప్రేరణ కలిగించే వ్యక్తులుగానీ, సంఘటనలు గానీ నాకు కనిపించలేదు. వాటికోసం ప్రత్యేకంగా శ్రమపడి రాయడం రుచించలేదు.

ప్ర : జ్ఞానపీఠ పురస్కారం వచ్చిందని తెలిసినప్పుడు మీకేమనిపించింది?

జ : ఏదో కొత్త సిద్ధి ప్రాప్తించినట్లేమీ అనిపించలేదు. అందరికీ ఎలాంటి సంతోషం కలుగుతుందో, అలాంటి సంతోషమే నాకూ కలిగింది. ఆఁ, మనసుకు సంతృప్తి మాత్రం తప్పక కలిగింది. కవిత్వం నాకు గౌరవం తెచ్చిపెట్టింది. కవిత్వమే నాకు సమత్వం కూడా ప్రసాదించింది.

ప్ర : మానవ జాతికి మీరిచ్చే సందేశం ఏమిటి?

జ : మిమ్మల్ని రూపొందించే మిత్రుడు మీరే!

# ఎడారి సూర్యుడు
## (సౌరశక్తి వినియోగంలో నూతన ప్రయోగం)

- డా॥ కె. లక్ష్మీనారాయణ

**సంగ్రహ వాక్యం :** "ఎడారి సూర్యుడు" అంటే వేరే ఎక్కడి నుండో మరొక సూర్యుడు వచ్చి ఎడారిలో ఉంటాడని కాదు భావం. మనకు కనిపించే సూర్యుడొక్కడే. కాని ఎడారి ప్రాంతాలలో ప్రసరించే అపారమైన సూర్యరశ్మిని "సౌరశక్తి"గా మార్పు చేసి, ప్రపంచానికంతటికీ విద్యుచ్ఛక్తిని అందించే "CSP" సాంకేతిక పరిజ్ఞానం, సాధ్యాసాధ్యాలు మొదలైన అంశాలను తెలియ జేయడం ఈ వ్యాసం యొక్క ఉద్దేశ్యం.

**కొన్ని సాంకేతిక పదాలు :** కాలరీ, బారల్, మిలియను, పారబాలిక్, డిశాలినేషన్, ఎయిర్‌కండిషన్.

**పరిచయం:** ఊహకందని రీతిలో పెరిగే ప్రపంచ జనాభా అవసరాలను తీర్చడానికి, అభివృద్ధి చెందుతున్న దేశాలతో పాటు, చిన్న దేశాలు వాటి జీవన స్థాయిని వృద్ధి చేసుకునే క్రమంలో, వివిధ రకాల ఇంధన వనరులను పూర్తి స్థాయిలో, నిరాటంకంగా సరఫరా జరగవలసిన అవసరం ఎంతో ఉంది.

కండ బలం కొద్దీ మనిషి ఎక్కువ పని చేయగలుగుతాడు. అదే విధంగా యంత్రాల సహాయంతో సరిపడే ఆహార పదార్థాలను సమకూర్చు కోవడం, విజ్ఞానంతో పాటు, సమాజంలోని ఆధునిక సౌకర్యాలను సమకూర్చుకోవడం, ఆ విధంగా ఆర్థిక పరిపుష్ఠతను సాధించడానికి వీలు పడుతుంది. ఈ విధమైన యాంత్రిక జీవనం ఒక విధంగా ఆశ్చర్యాన్ని కలిగించినప్పటికీ, ఇక్కడ ఆందోళన కరమైన అంశం మరొకటి ఉంది. ఉదాహరణకి, మనం తినే ఆహారా పదార్థాలను సమకూర్చు కోవడంలో, ప్రతి 1 కాలరీ శక్తిని అందించే ఆహారాన్ని ఉత్పత్తి చేసుకోవడానికి, భూమి దున్నడం, విత్తనాలు నాటడం దగ్గర నుండి, కోతలు, సేకరణ, రవాణా, సరఫరా మొదలైన రంగాలలో అదే 1 కాలరీ శక్తిని తిరిగి వినియోగించ వలసి ఉంటుంది. దీని ప్రకారం, ఇంధన సరఫరా ఆగిపోవడం, తరిగి పోవడం వంటివి జరిగితే ఆహారపదార్థాల ఉత్పత్తికే విఘాతం కగలుగుతుంది.

**ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ఆవశ్యకత :** ప్రపంచంలోని వివిధ దేశాలలో సుమారు 80శాతం అవసరాలను బొగ్గు, చమురు, సహజ వాయువులు వంటి జీవ సంబంధమైన ఇంధనాలు తీరుస్తున్నాయి. సూర్యరశ్మి ప్రభావానికి, భూమి లోపల సంభవించిన అనేక భౌగోళిక మార్పులకి, కొన్ని వేల సంవత్సరాల క్రితమే ఇవి నిక్షిప్తమై ఉన్నాయి. ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వీటిని సులువుగా రవాణా చేసుకునే వీలున్నప్పటికీ, 2030వ సం॥కి వీటి నిల్వలు తరిగిపోయే ప్రమాదం ఉందని, International Energy Agency సూచిస్తోంది. నానాటికి పెరిగిపోతున్న అవసరాల కనుగుణంగా ప్రపంచానికి నేడు కావలసిన శక్తి 12 Tetra Watts అయితే ఈ శతాబ్దాంతానికి ఈ పరిమాణం 15 Tetra Watts కి పెరిగిపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ఈ కొరతను తీర్చడానికి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులకై అన్వేషణ ప్రారంభమైంది. సుమారు 65 సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన "పరమాణుశక్తి", వ్యాపార సరళిలో నేటికి వాస్తవ రూపం పొందింది.

Gas hydrates, coal-bed methane, Thorium-bearing beach sands, off shore wind turbine, Biodiesel conversion of coal to oil, Fuel cells, super-conductivity,

డా॥ కె. లక్ష్మీనారాయణ, డో॥నెం॥ 2-55, రంగా మందులషాపు వెనుక, కొత్తూరు,
ఎ యమ్ ఎ యల్ కాలేజీ జంక్షను, అనకాపల్లి-531 001, విశాఖ జిల్లా.

magnetic Levitation, Energy from hot rocks, E 85 (a mixture of Ethanol and gasoline) Gasohol, Tidal and wave power from sea, Helium – 3 (a mixture of Helium and Deuterium) మొదలైన సాంప్రదాయేతర, ప్రత్యామ్నాయ ఇంధన వనరులు ఇంకా పరిశోధనా స్థాయిలోనే ఉన్నాయి. ప్రపంచం యొక్క ఇంధన అవసరాలను తీర్చడంలో ఇవి ఎంత వరకు సఫలీకృతం చెంది సత్ఫలితాలను ఇస్తాయో ఊహించడం కష్టం.

**పరిష్కారం:** భవిష్యత్తులో ఇంధన అవసరాల కొరతను తీర్చడానికి ప్రయోగ పూర్వకంగా, వ్యాపార సరళిలో "సౌరశక్తి"ని వినియోగించుకునే మార్గాల కొరకై "శాస్త్ర - సాంకేతిక నిపుణులు" అన్వేషిస్తున్నారు. ఈ దిశలో ఐకరాజ్య సమితి, 1961వ సం॥లో, రోమ్ నగరంలో ఒక సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో రష్యా, అమెరికా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, ఇస్రాయిల్ వంటి దేశాలు "సౌరశక్తి"పై విస్తృతమైన పరిశోధనకు తమ అంగీకారాన్ని తెలియజేశాయి. అంతకు ముందే 1955వ సం॥లో Arizona State University ప్రధాన కేంద్రంగా సుమారు 87దేశాలకు చెందిన 1000 మంది సభ్యులతో The Solar Energy Society ని స్థాపించారు. భారతదేశంలో కూడా Solar Energy Society of India (Indian Section) విభాగాన్ని స్థాపించడం జరిగింది. నాటి నుండి శాస్త్ర బద్ధంగా "సౌరశక్తి"పై నిర్వహించిన పరిశోధనలు, ఎన్నో సత్ఫలితాలను అందించింది.

ఏకోణం నుంచి చూసిన "సౌరశక్తి"పై పరిశోధనకి ఒక ప్రత్యేకత ఉంది. ఈ పరిశోధనా రంగంలో భౌతిక, రసాయనిక శాస్త్రాలకు చెందిన శాస్త్రవేత్తలు, కెమికల్, మెకానికల్ ఎలక్ట్రికల్ విభాగాలకు చెందిన సాంకేతిక నిపుణులు, వృక్ష, జంతు, వాతావరణ శాస్త్రవేత్తలతో పాటు, ఖగోళ శాస్త్రవేత్తల పాత్ర ప్రముఖంగా ఉంటుంది.

**సౌర శక్తి (లేక) సౌర వికిరణం అంటే?** భౌతిక శాస్త్ర నియమాల ప్రకారం, ఒక యానకం ద్వారా శక్తి ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి రవాణా జరుగుతుంది. సూర్య గోళం నుండి వెలువడే శక్తి లేక సౌర వికిరణం (Radiation) యానకం అవసరం లేకుండానే భూమికి చేరుతుంది.

రోజు మొత్తం మీద ఈ సౌర వికిరణం తీవ్రత మారుతూ ఉంటుంది. బాగా ఎండగా ఉన్న రోజున, సౌర వికిరణం తీవ్రత ఉదయం శూన్యంగాను, మధ్యాహ్నం అత్యధికంగా అనగా 0.5 నుండి 1.5 కాలరీలు / చ॥సెం॥ / ని॥గా ఉంటుంది. (1 కాలరీ = ఉష్ణశక్తిని కొలిచే ప్రమాణం. 1 గ్రాము నీటిని 15$^{\circ}$C నుండి 16$^{\circ}$C కి పెంచడానికి కావలసిన ఉష్ణం). ఇది ఋతువును బట్టి, అక్షాంశాలను బట్టి మారుతూ ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా, "జులై" నెలలో సౌర వికిరణంలో మార్పును ఈ క్రింది పటం సూచిస్తుంది. పటం-(1). సౌర వికిరణంలో మార్పు, ఆకాశంలో మేఘాల వలన. స్థానిక వాతావరణ పరిస్థితులను బట్టి జరుగుతూ ఉంటుంది. భూగోళం మీద 30$^{\circ}$ ఉత్తర, 30$^{\circ}$ దక్షిణ అక్షాంశాల మధ్య సూర్యరశ్మి ఎక్కువగా ప్రసరించే ప్రాంతాన్ని Sun Belt అంటారు. ఈ ప్రాంతంలో నివశించే సుమారు, 2 బిలియన్ల మంది ప్రజలకి విద్యుచ్ఛక్తి అంటే ఏమిటో ఈనాటికీ తెలియదు.

సౌర వికిరణం (Solar Radiation) ఎంత తీవ్రమైనదో ఈక్రింది గణాంకాలు సూచిస్తాయి.

బాగా ఎండకాసే రోజున, సూర్యరశ్మిలో శక్తి, 1కా॥/చ॥సెం॥/1ని॥ గా ఉంటుంది. అనగా 1 లాంగ్లే/ని॥ (లాంగ్లే - శాస్త్రవేత్త పేరు) (లేక) 500 కా॥/చ॥సెం॥/రోజు (లేక) 500,000 కాలరీలు/చ॥అ॥/రోజు.

పట్టిక - (1)

SOURCE : Commerce Annual Number - 1977

| ప్రదేశం | జనవరి | ఫిబ్రవరి | మార్చి | ఏప్రియల్ | మే | జూన్ | జులై | ఆగష్టు | సెప్టెంబరు | అక్టోబరు | నవంబరు | డిసెంబరు | సం॥ రానికి |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| శ్రీనగర్ | 175 | 247 | 386 | 493 | 593 | 628 | 583 | 506 | 427 | 322 | 278 | 178 | 401 |
| గుల్మార్గ్ | 265 | 303 | 346 | 425 | 411 | 491 | 406 | 337 | 365 | 293 | 291 | 223 | 346 |
| న్యూఢిల్లీ | 341 | 430 | 518 | 584 | 627 | 569 | 443 | 432 | 474 | 454 | 386 | 323 | 465 |
| జోద్‌పూర్ | 399 | 467 | 557 | 627 | 651 | 619 | 513 | 485 | 520 | 497 | 421 | 375 | 511 |
| షిల్లాంగ్ | 316 | 449 | 437 | 467 | 493 | 363 | 327 | 351 | 293 | 351 | 343 | 333 | 377 |
| అహమ్మదాబాద్ | 410 | 493 | 563 | 623 | 650 | 565 | 413 | 405 | 480 | 496 | 420 | 387 | 492 |
| కోల్‌కతా | 357 | 417 | 480 | 528 | 542 | 413 | 394 | 392 | 367 | 381 | 386 | 350 | 417 |
| భావ్‌నగర్ | 431 | 502 | 588 | 614 | 655 | 547 | 389 | 369 | 505 | 515 | 446 | 394 | 496 |
| నాగపూర్ | 420 | 500 | 543 | 583 | 598 | 505 | 379 | 367 | 433 | 488 | 442 | 390 | 471 |
| పూనా | 445 | 524 | 578 | 611 | 620 | 514 | 300 | 392 | 448 | 487 | 435 | 409 | 487 |
| విశాఖపట్టణం | 451 | 521 | 553 | 567 | 576 | 425 | 395 | 444 | 438 | 445 | 441 | 427 | 473 |
| హైదరాబాద్ | 409 | 505 | 521 | 533 | 579 | 461 | 334 | 352 | 339 | 392 | 347 | 394 | 431 |
| గోవా | 484 | 541 | 579 | 599 | 588 | 434 | 329 | 436 | 467 | 490 | 467 | 453 | 490 |
| మద్రాసు | 441 | 539 | 584 | 581 | 559 | 498 | 449 | 474 | 482 | 425 | 367 | 376 | 481 |
| బెంగుళూరు | 472 | 493 | 596 | 587 | 556 | 443 | 354 | 366 | 405 | 412 | 338 | 417 | 466 |
| మంగుళూరు | 455 | 518 | 551 | 541 | 503 | 359 | 293 | 353 | 413 | 421 | 411 | 431 | 427 |
| పోర్టుబ్లేయరు | 403 | 486 | 515 | 492 | 307 | 306 | 300 | 247 | 361 | 346 | 342 | 374 | 373 |
| కొడైకనాల్ | 508 | 562 | 555 | 535 | 550 | 445 | 374 | 397 | 421 | 383 | 405 | 453 | 462 |
| త్రివేండ్రం | 503 | 538 | 563 | 530 | 470 | 449 | 416 | 458 | 499 | 448 | 425 | 442 | 478 |
| మినికాయ్ | 470 | 488 | 508 | 499 | 423 | 376 | 378 | 412 | 431 | 412 | 420 | 402 | 435 |

దీని ప్రకారం 15 చ॥అ॥ ప్రదేశంపై ప్రసరించే సౌర వికిరణం నుండి 1 చ॥అ॥కి॥ 1 నిమిషంలో 15 కిలో కాలరీల శక్తి లభిస్తుంది. ఇది ఉష్ణశక్తి రూపంలో 1 కిలోవాట్‌కి సమానం.

ఈ వివరాలను మనం నివసించే గృహాలకు వర్తింప చేస్తే, ఉదాహరణకి, 1000 చ॥అ॥ వైశాల్యం గల పైకప్పు గల ఇల్లు, బాగా ఎండకాసే రోజున, సూర్యరశ్మి నుండి 70 కి॥వా॥ శక్తిని గ్రహిస్తుంది. ఇది 560 కి॥వా॥ గంటలగా సలీన్‌కి సమానం. దీన్ని 10 శాతం సామర్థ్యంతో విద్యుచ్ఛక్తిగా మారిస్తే, 7 కిలోవాట్ల విద్యుచ్ఛక్తి లభిస్తుంది. లేక 56 కి॥వా॥ గంటల విద్యుచ్ఛక్తికి సమానం అవుతుంది. ఈ విద్యుచ్ఛక్తి, నివాస గృహంలో గల విద్యుత్ పరికరాలన్నీ పని చేయడానికి సరిపోతుంది.

ఈ గణాంక వివరాలను, విశాలమైన ప్రదేశాలకు వర్తింప చేస్తే అనగా, 1 ఎకరం ప్రదేశంలో ప్రసరించే సూర్యరశ్మి నుండి 10 శాతం సామర్థ్యంతో 280 కి॥వా॥ విద్యుచ్ఛక్తిని, 1చ॥ మైలు ప్రదేశం నుండి, 1,80,000 కి॥వా॥ విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయవచ్చు. దీని ప్రకారం, ఒక సంవత్సరంలో ప్రపంచం మొత్తం మీద ఉపయోగించే బొగ్గు, చమురు, సహజవాయువుల నుండి లభించే ఉష్ణశక్తి, ఒక్క ఉత్తర ఛిలీలో గల 180 మైళ్ళ పొడవు, 100 మైళ్ళ వెడల్పు గల భూ భాగంలో విస్తరించిన ఎడారి ప్రాంతంలో ప్రసరించే సూర్యరశ్మి నుండి లభిస్తుంది. దీని ప్రకారం, భూగోళం మీద సుమారు 21 ప్రదేశాలలో విస్తరించి ఉన్న ఎడారి భూములలో ప్రసరించే మొత్తం సూర్యరశ్మి నుండి ఎంత విద్యుచ్ఛక్తి లభిస్తుందో అది ఊహకి అందని అంశం.

అందుచేత Solar Radiation in often the most important, potentially available, natural resource గా చెప్పవచ్చు.

**భారత దేశానికి గల ప్రత్యేకత :** అయన రేఖా ప్రాంతానికి చెందిన (మకర రేఖ - కర్కాటక రేఖల మధ్య గల ప్రదేశం) మన భారత దేశంలో సంవత్సరం మొత్తం మీద సుమారు 300 రోజులు సూర్యరశ్మి బాగా ప్రసరిస్తుంది. అందుచేత సౌరశక్తిని సక్రమంగా వినియోగించుకునే అవకాశాలు చాలా ఎక్కువ.

భారత భూ భాగంపై ప్రసరించే సౌరశక్తి $4 \times 10^{12}$ కి॥వా॥ (లేక) 8000 కి॥వా॥/person. ఇది వికిరణ రేటులో 2.0 కా॥/చ॥సెం॥/ని॥ (లేక) 0.33 కి॥కా॥/చ॥మీ॥/సె॥కి సమానం.

కాని సౌర వికిరణంపై వాతావరణంలో ధూళికణాలు, మేఘాలు, నీటి ఆవిరి మొదలైనవి కలిగించే అవరోధాల వలన, భారత భూతలానికి చేరే సౌరశక్తి కొంత తగ్గినప్పటికి, మొత్తం దేశ అవసరాలకు కావలసిన శక్తి కన్న ఎన్నో రెట్లు, సౌరశక్తి నుండి లభిస్తుంది. భారత దేశంలో వివిధ ప్రాంతాలలో లభించే సౌర వికిరణం వివరాలను బట్టి పట్టిక (1), మే నెలలో సౌర వికిరణం 550 కి॥కా॥/చ॥సెం॥/రోజు, జనవరి నెలలో 350 కి॥కా॥/చ॥సెం॥/రోజుగా ఉన్నట్లు తెలుస్తుంది.

పైన సూచించిన విశ్లేషణ ప్రకారం, భవిష్యత్తులో యావత్ ప్రపంచానికి కావలసిన ఇంధన వనరులను తీర్చడానికి "సౌరశక్తి" ఒక్కటే పరిష్కారం. దీనికి ఎడారి ప్రాంతాలు ఏవిధంగా అనువుగా ఉంటాయో పరిశీలిద్దాం.

భారతదేశంలో 20 ప్రాంతాలలో సమతల ప్రదేశంపై పడే సౌరవికిరణం యొక్క సరాసరి నేలవారి విలువలు పైపట్టిక సూచిస్తుంది. (కా॥/చ॥సెం॥/రోజు)

**ఎడారి నుండి సౌరశక్తి :** ఎడారిలో ప్రసరించే సూర్యకాంతిని "సౌరశక్తి"గా మార్చి వివిధ రంగాలలో ఉపయోగించుకోగలిగితే ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఇంధన సంక్షోభాన్ని పూర్తిగా అధిగమించవచ్చునని శాస్త్రజ్ఞులు భావించారు.

సౌరశక్తి అనగానే, ఇంటి పైకప్పుకి అమర్చిన రెండు అద్దాల ద్వారా నీటిని వేడి చేయడం, స్వల్ప పరిమాణంలో విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేసుకోవడం ఇంతేకదా అని తేలికగా భావిస్తారు. కాని నేటి ఆధునిక శాస్త్రపరిజ్ఞానంలోని మేళకు వలనుగాని, రోదసీ పరిజ్ఞానంలోని సూక్ష్మమైన అంశాలను వేటిని పరిగణించకుండా, స్వల్పమైన, చిన్న పరికరాలతో తక్కువ ప్రదేశం నుండి ఊహించని పరిమాణంలో సౌరశక్తిని విద్యుచ్ఛక్తిగా మార్పు చేయవచ్చునని Concentrated Solar Powerపై చేసిన పరిశోధనలు నిరూపిస్తున్నాయి. ఈ ప్రయోగం, కాగితాన్ని ఎండలో ఉంచి, భూతద్దంతో (Magnifying glass) మండించినంత సుళువైనది.

**అనువైన ప్రదేశాలు :** భూగోళం మీద 29 శాతం అనగా 148,326,000 చ॥కి॥మీ॥ భూభాగం, 71 శాతం అనగా 361,740,000 చ॥కి॥మీ॥ ప్రాంతం నీటితో నిండి ఉంది. భూభాగంలో సుమారు 192,35,182 చ॥కి॥మీ॥ ప్రదేశం, నిరుపయోగంగా పడిఉన్న ఎడారి ప్రదేశం. ఈ ఎడారి భూములు సుమారు 21 ప్రాంతాలలో విస్తరించి ఉండగా వీటిలో సహారా, అరేబియా, గోబి ఎడారులు చాలా పెద్దవి. వీటి విస్తీర్ణాలు ఈ క్రింది పట్టికలో తెలుస్తాయి.

**ముఖ్యమైన ఎడారులు :**

| | |
|---|---|
| సహారా, ఉత్తరమెరికా | 9,064,650 చ॥కి॥మీ॥ |
| అరేబియా | 2,589,900 చ॥కి॥మీ॥ |
| గ్రేట్ విక్టోరియా, ఆస్ట్రేలియా | 647,475 చ॥కి॥మీ॥ |
| కలహారి, దక్షిణాఫ్రికా | 582,727 చ॥కి॥మీ॥ |
| ఛిహుఆహువాన్, మెక్సికో | 453,232 చ॥కి॥మీ॥ |
| థార్, ఇండియా / పాకిస్థాన్ | 453,232 చ॥కి॥మీ॥ |
| అటకామ, ఛిలీ (SA) | 1,39,854 చ॥కి॥మీ॥ |
| గోబి, చైనా | 1,294,950 చ॥కి॥మీ॥ |
| కొలరాడో, పశ్చిమ అమెరికా | 336,687 చ॥కి॥మీ॥ |

ఇవే కాక, ఉత్తరాఫ్రికా, అర్జెంటీనా, పశ్చిమాసియా, చైనా, ఇరాన్ మొదలైన ప్రదేశాలలో కూడా ఎడారులు విస్తరించి ఉన్నాయి. ఇదిలా ఉండగా, ఒక చ॥కి॥మీ॥ ప్రదేశంలో సంవత్సరం మొత్తం మీద ప్రసరించే సూర్యకాంతి నుండి లభించే శక్తి 1.5 మిలియన్ బారల్స్ చమురు నుండి లభించే శక్తికి సమానం. (1 మిలియను = 10 లక్షలు, 1 బారలు = 42 గాలన్లు, 1 గాలను = 4.546 లీటర్లు). ఈ అధ్యయనం ప్రకారం, ఎడారి భూముల మొత్తం విస్తీర్ణంలో 0.5 శాతం ప్రదేశంలో ప్రసరించే సూర్యరశ్మిని "CSP" సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచ దేశాలన్నిటికి సరిపోయే విద్యుత్తును నిరాటంకంగా ఉత్పత్తి చేయవచ్చు.

ఒక్క ఉత్తరాఫ్రికాలో విస్తరించిన ఎడారి భూముల ద్వారా యూరోపియన్ దేశాలన్నిటికి సరిపోయే విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయవచ్చునని జర్మనీకి చెందిన డా॥గెర్హార్డ్‌నీస్, డా॥ఫ్రాన్జ్‌ట్రీబ్ అనే ఇద్దరు శాస్త్రవేత్తలు నిర్వహించిన పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇక మన దేశంలో సుమారు 453,252 చ॥కి॥మీ॥ ప్రాంతంలో వ్యాప్తి చెందిన "థార్" ఎడారిలో "CSP" సాంకేతిక సముదాయాన్ని నెలకొల్పి 678848 మిలియన్ బారల్సు చమురు నుండి లభించే శక్తిని ఉత్పత్తి చేయవీలవుతుంది. దీన్ని భారత దేశంలో వివిధ ప్రాంతాలకు ప్రత్యేక గ్రిడ్ల ద్వారా నిరంతరం స్వచ్ఛమైన విద్యుచ్ఛక్తి రూపంలో సరఫరా చేస్తూ, ఇంధనం కొరతను శాశ్వతంగా పరిష్కరించవచ్చు.

Concentrated Solar Power (CSP) అంటే?

According to one philosophy, new developments will come automatically as the technological ceiling rises.

But the ceiling does not rise spontaneously, it rises only because individual scientists, engineers, and entrepreneurs like to pioneer - and their efforts make it rise - అని ఒక మేధావి సూచించాడు.

సౌరశక్తిని ఒకే ప్రదేశం వైపు కేంద్రీకృతం చేయడం "CSP" సాంకేతిక పద్ధతిలో ఇమిడి ఉన్న ప్రధానసూత్రం. ఈ ప్రక్రియ పాతకాలం నాటిదే. దీని రూపాంతరాలు వేరైనప్పటికి, అన్నిటిలోను వెండిపూత పూసిన "పారబాలిక్" దర్పణాలను ఉపయోగిస్తారు. వీటిపై సూర్యకిరణాలను, కొన్ని ప్రత్యేక తరహా వాయుపదార్థాలు, చమురు పదార్థాలతో నింపిన పాత్రలపైకి, గొట్టాలపైకి కేంద్రీకృతం చేస్తారు. సూర్యకిరణాలలో వేడికి, గొట్టాలు, పాత్రలలో గల చమురు, వాయుపదార్థాల ఉష్ణోగ్రత 400C (752F) వరకు పెరుగుతుంది.

ఈ విధంగా ఉష్ణశక్తి రూపంలోకి మారిన సౌరశక్తిని, Heat Exchangers ద్వారా నీటి ఆవిరిని ఉత్పత్తి చేసి, Steam Turbineలను నడిపించి, విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయడం జరుగుతుంది. ఈ ప్రయోగంలో సౌరశక్తిని, ఉష్ణశక్తిని అనుసంధానం చేస్తారు కనుక ఈ విధానాన్ని Integrated Solar Combined Cycle (ISCC) అంటారు. ఈ విధానంలో భారత దేశంలో, రాజస్థాన్‌లో గల Mathania గ్రామంలో ఇప్పటికే 140 MW విద్యుత్ కేంద్రం పనిచేస్తోంది. ఇక్కడ ఒక అంశం గమనించాలి. ఇంతే సామర్థ్యం గల, బొగ్గుతో నడిచే విద్యుత్కేంద్రం నుండి సంవత్సరానికి సుమారు 520,000 టన్నుల కార్బన్‌డైయాక్సైడ్ విడుదలై వాతావరణాన్ని కలుషితం చేస్తుంది.

**విద్యుత్ పంపిణీ - ఉత్పత్తికయ్యే ఖర్చు** : The popularity of energy source in dependent on its a availability, convenience, and cost.

"CSP" సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్పత్తి చేసే విద్యుచ్ఛక్తికయ్యే ఖర్చు 50 డాలర్లతో, 1 బారల్ చమురును ఉత్పత్తి చేసే పరిశ్రమకి సమానం. జర్మనీ సాంకేతిక నిపుణులు అంచనాల ప్రకారం. ఈ సాంకేతిక పరిజ్ఞానంలో ఉపయోగించే "పారబాలిక్" దర్పణాల ఉత్పత్తి పెరిగే కొలది దీనికయ్యే ఖర్చు 20 డాలర్లకు తగ్గుతుంది. ఇది గృహోపయోగాలకు ఇంటి పై కప్పులపై ఉపయోగించే Photo Voltaic cels కి అయ్యే ఖర్చులో సగం మాత్రమే అవుతుంది.

విద్యుచ్ఛక్తితో పాటు, లవణరహితమైన (Desalination) నీటిని రాబట్టడం, ఉష్ణోగ్రతలను అదుపులో ఉంచడం (Air Conditioning) మొదలైన అంశాలు కలిసినప్పుడు, ఈ విద్యుచ్ఛక్తియకు ఉత్పత్తి రేటు ఇతర పద్ధతులకన్నా గణనీయంగా తగ్గుతుంది.

ఈ సాంకేతిక పద్ధతిలో విద్యుదుత్పత్తికి ఎడారి ప్రాంతాలు అనువైన ప్రదేశాలుగా గుర్తించిన తరుణంలో, ఉత్తర ఐరోపాలో ప్రసరించే సూర్యరశ్మికి సుమారు మూడు రెట్లు మిగిలిన ఎడారి భూములలో ప్రసరిస్తుంది. ఇక్కడ తయారైన విద్యుచ్ఛక్తిని ఇతర ప్రాంతాలకు సరఫరా చేయుటలో పటిష్ఠమైన పంపిణీ వ్యవస్థ కావాలి. దానిని నెలకొల్పడానికి యూరపు, మధ్య ఆసియా, ఆఫ్రికా దేశాల మధ్య సమన్వయం, సహకారం ఎంతో అవసరం.

కర్బన రహితమైన ఈ విద్యుచ్ఛక్తిని ఇతర ప్రాంతాలకు సరఫరా చేయుటలో, High Voltage Direct Current grid (HVDC) ఎంతో సమర్థవంతంగా పని చేస్తుంది. నేడు వాడుకలో ఉన్న Alternating Current Cable వలన, ఉష్ణం రూపంలో ఎక్కువ శాతం విద్యుత్తు వృధా అయిపోతుంది. AC కేబుల్ వ్యవస్థ స్థానంలో DC కేబుల్ వ్యవస్థను నెలకొల్పుట వలన నష్టపోయే విద్యుచ్ఛక్తి శాతాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ప్రతి 1000 కి॥మీ॥ దూరానికి ఈ పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా అయే విద్యుత్‌లో సుమారు 3శాతం మాత్రమే నష్టం జరుగుతుదని German Air and Space Agency సూచిస్తోంది. దాని ప్రకారం ఉత్తరాఫ్రికా నుండి, బ్రిటన్‌కు విద్యుత్తును సరఫరా చేయడంలో జరిగే నష్టం సుమారు 10శాతం మాత్రమే. జర్మనీ సాంకేంతిక నిపుణుల రిపోర్టు ప్రకారం, HVDC grid వ్యవస్థ ద్వారా 2050వ సం॥ నాటికి యూరపు-ఉత్తరాఫ్రికా దేశాలకు చాలినంత విద్యుత్తును సరఫరా చేయ వీలవుతుంది. ఫలితంగా, అణుశక్తితోపాటు, జీవ సంబంధమైన ఇంధనాల వాడకం కొంత కాలంలో పూర్తిగా కనుమరుగై పోతుంది.

ప్రపంచంలో అత్యధిక పరిమాణంలో నూనె-సహజ వాయువు నిక్షేపాలు "అల్జీరియా - లిబియా" దేశాలలో ఉన్నాయి. ఈ దేశాల నుండి పైపు లైన్ల ద్వారా యూరపు దేశాలకు హెచ్చు పరిమాణంలో నూనె-సహజ వాయువులు నిరంతరం ఎగుమతి అవుతూ ఉంటాయి. కాని ఈ దేశాలలోనే విశాలమైన ప్రదేశాలలో సూర్యరశ్మి కూడా లభించడం ఒక వరం. CSP సాంకేతిక పద్ధతిలో విద్యుదుత్పత్తిని చేసి, యూరపు దేశాలకు సరఫరా చేయడానికి ఈ రెండు దేశాలకు అవకాశాలు మెండుగా ఉన్నాయి.

తమ దేశాలలో గల చమురు-సహజ వాయువు నిల్వలకి, సరఫరాకి ఎక్కడ అవరోధం కలుగుతుందోననే అనుమానం గల OPEC (Organisation of The Petroleum Exporting Countries) సభ్య దేశాలు ఆందోళన చెందనవసరం లేదు. కారణం ఆయా దేశాలలో పుష్కలంగా ఎండ (సూర్యరశ్మి) కాచే ఎడారి ప్రదేశాలున్నందు వలన, CSP సాంకేతిక పద్ధతి, ఎడారి ప్రదేశాలు వారికి అదనపు ఆదాయాన్ని చేకూరుస్తాయి.

**ప్రముఖుల అభిప్రాయాలు :** The larger is the explored area, the larger are the boundaries of the unknown అని ప్రముఖ గణిత విద్వాంసుడు Laplace చెప్పిన మాటలను బట్టి, Concentrated Solar Power సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచ దేశాలకు ఇంకా కొత్త. ఇప్పుడే గనిలోంచి తీసిన రత్నంలాంటి ఈ పద్ధతిని తెలియజేయుటకు, Trans-mediterranian Renewa bce Energy Corporation (TREC) అనే సంస్థ కొంతమంది ఇంధన వనరుల నిపుణులు, ఆర్థిక శాస్త్రవేత్తలతో ఒక బృందంగా ఏర్పడింది.

ఒక అధ్యయనంలో తెలిసిన వివరాలను బట్టి, ఫ్రాన్సులో సుమారు 7బిలియన్ల పౌండ్లను వెచ్చించి Fusion Reactorను నిర్మించి తద్వారా విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయాలని, సుమారు 30 దేశాలు సంకల్పించాయి. కాని Experts from advanced economies, policy makers, equipement manufactures, technology providers, project developers, research organisation మొదలైన సంస్థలకు చెందిన నిపుణుల అంచనాల ప్రకరం పైపు యత్నం లాభసాటి కాదని ఈ మొత్తాన్ని CSP సాంకేతిక పరిజ్ఞానానికి వెచ్చించి ఉంటే 2056వ సం॥కు విద్యుదుత్పాదన - సరఫరా నిరాటంకంగా జరిగి ఉండేదని తెలిపింది.

Economic Research Council కి చెందిన ఇంధన రంగంలో నిపుణులు Dan Lewis ప్రకారం, CSP సాంకేతిక పరిజ్ఞానంతో 1 Megawatt విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేసే కర్మాగారాన్ని

నెలకొల్పడానికి 3నుండి 5మిలియన్ల డాలర్లు ఖర్చవుతుందని, ఇది Fusion Reactorని నెలకొల్పడానికయే ఖర్చులో సుమారు 5వ వంతు మాత్రమే అవుతుంది. ఇప్పటికే పనిచేస్తున్న విద్యుదుత్పత్తి కేంద్రాల వివరాలు ఇలా ఉన్నాయి.

1. ఆస్ట్రేలియా ఎడారి మండలంలో నెలకొల్పిన New Castle (National Solar Energy Centre) కేంద్రం.
2. కాలిఫోర్నియాలో "మెజావ్" ఎడారిలో నెలకొల్పిన విద్యుత్ కేంద్రం సుమారు 15 సంవత్సరాల నుండి పనిచేస్తుంది.
3. మన దేశంలో థార్ ఎడారికి సుమారు 30 కి॥మీ॥ దూరంలో గల "మథానియా" అనే గ్రామంలో నెలకొల్పిన విద్యుత్ కేంద్రం 140 MW సామర్థ్యం గలది.

నివాడా, దక్షిణ స్పెయిన్‌లలో ఈ విద్యత్ కేంద్రాలను నెలకొల్పే సన్నాహాలు జరుగుతున్నాయి.

**ముగింపు :** సూర్యకిరణాలను కేంద్రీకృతం చేయుటకు ఎడారి ప్రాంతాలలో అమర్చిన విశాలమైన దర్పణాల క్రింద భాగం నీడగా ఉంటుంది. పరిశ్రమల నుండి లభించే లవణరహిత నీటిని ఉపయోగించుకుని ఈ నీడ ప్రదేశాలను ఉద్యాన వనాలుగా మార్చుకోవచ్చు.

తక్కువ ఖర్చుతో స్వచ్ఛమైన, కర్బన రహితమైన, పరమాణు రహితమైన విద్యుత్తును ఉత్పత్తి చేయడమే కాక, ఈ విధానంలో Aircondition అంశాన్ని చేర్చుట వలన, చల్లని నీరు కూడా లభిస్తుంది. అందువలన CSP సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే విద్యుదుత్పత్తి కేంద్రాల సామర్థ్యం సుమారు 80 నుండి 90శాతం వరకు పెరుగుతుంది.

చమురు, సహజ వాయువులు, యురేనియం వంటి ముడి పదార్థాల రవాణాలో ఎదురయే సాంకేతిక సమస్యలు, ఈ CSP సాంకేతిక పద్ధతిలో ఉండవు.

పై అంశాలను బట్టి నిరుపయోగంగా విస్తరించి ఉన్న ప్రపంచంలోని ఎడారి ప్రాంతాలలో ప్రసరించే సూర్యరశ్మి ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్ సురక్షితమైనది. ఈ విధంగా భూవాతావరణ పరిరక్షణలోను, ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఇంధన సంక్షోభాన్ని పూర్తిగా తొలగించుటలోను, ఎడారి భూములు ఒకవైపు ఉద్యాన వనాలుగానూ, మాగాణి భూములు గాను మారుతూ, విద్యుదుత్పత్తి కేంద్రాలుగా మారిపోయే కాలం ఎంతో దూరంలో లేదనిపిస్తుంది.

ఇసుక ఎడారిలో ఎపుడైనా ఒక చిన్న గులాబీ పువ్వు పూచేనా? అన్న ప్రశ్నకి పరిష్కారం దొరికినట్లే.

**సంప్రదించిన గ్రంథాలు**

1. Direct use of the Sun's energy, by Farrington Dariels. American Scientist, 55,1,1967.
2. How mirrors can light up the world, Here comes the sun - by Ashley Seager Guardian unlimited business.
3. German News, Vol XLII, October 2001.
4. Commerce Annual Number-1977 Page-101.
5. Solar Electricity - A hybrid system approach by M.A. Duguar. American Scientist. Vol - 65, No - 4, July-Aug - 1977.
6. Science in the USSR, 1988, No-1.

# ఆమూర్త చిత్రకళకు ఆది గురువు - కాండిన్స్కీ

- కాం(డ్రేగుల నాగేశ్వరరావు

ఇరవైవ శతాబ్దపు చరిత్ర పుటల్లో ఆ శతాబ్దపు జీవన సరళికి, తాత్వికతకు అద్దం పట్టే ఒక శైలీ విభేదం అమూర్తా చిత్రకళ. ఇది చిత్రకళకు ఆ శతాబ్దపు కానుక. ఎవరికి వారు చూసి అనుభూతిని పొందటమే కాని ఇతరులకు వ్యక్తీకరించడానికి ఏ విధమైన వెసులు బాటు లేకుండా చిత్రించ బడే ఈ శైలికి మూల పురుషుడు కాండిన్స్కీ (Kandinsky).

ఇరవైవ శతాబ్దపు తొలి దశకంలో ఫ్రాన్స్, ఇటలీ దేశాలలో చిత్రకళ అనేక రీతులుగా కొత్త పుంతలను అన్వేషించింది. ఈ దేశాల ప్రాభవానికి దూరంగా ఉన్న రష్యా దేశంలో ఒక కళాకారుడైన కాండిన్స్కీ, కనీవినీ ఎరుగని విధంగా వస్తువు లేకుండా చిత్రిస్తూ ఒక non-bojective చిత్రకళా శైలినొక దానిని పెంపొందించాడు. అంతే కాదు దానికొక సిద్ధాంత భూమికను కూడా తయారు చేశాడు. ఏ ముహుర్తాన దానికి అంకురార్పణ జరిగిందో తెలియదు కాని, ఇది ఇరవైవ శతాబ్దపు చివరి వరకూ (మరో మాటగా చెప్పాలంటే ఇప్పకీ) నిలిచే ఉండి తన అస్తిత్వాన్ని చాటుకుంటూ వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా ఆధునిక చిత్రకారులు ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒక దశలో ఇలాంటి చిత్రాలు వేయకుండా ఉండలేక పోయారు. దీని ప్రభావం నుంచి తప్పించు కున్న వారిని బహుశ వేళ్ళపై లెఖ్ఖించ వచ్చు.

ఒక సంవత్సరంన్నర కాలంలో నూరు శరత్తులను పూర్తి చేసుకోబోయే ఈ ప్రక్రియ, గత నూరేళ్ళుగా అనేక ధూషణ భూషణ, తిరస్కారాలకు లోనై ఎన్నో ఆటు పోట్లను ఎదుర్కొంది. "గాడిద తోకకు రంగుల కుంచెను కట్టి కాన్వాస్‌పై ఒదిలితే వచ్చే రూపాలివి" అనే నికృష్టమైన రీతిలో హేళనకు గురైన చిత్రకళ కూడా ఇదే. ఎవరు ఎంత ఏవగించుకున్నా దీని మూలాలను పెళ్ళగించ లేక పోయారు.

అసలు ఈ ఆలోచన కాండిన్స్కీకి ఎందుకు తట్టింది? ఒక వర్గపు కళా విమర్శకులు అతని ఆలోచనలకు ఎందుకు బ్రహ్మరథం పట్టారు? పడుతున్నారు? ఎందుకు ఎంతో మంది చిత్రకళా విమర్శకులు, కనోజియర్స్ దీనిని సమగ్రంగా నిర్వచించ లేక విఫలులయ్యారు? రీతి, రివాజు లేక, సమగ్రమైన రూపుగాని, రంగుల సిద్ధాంతం గాని లేకుండా, మానవ మనస్సు ఎంత చంచల మైనదో ఇది అంతే చంచల మైనది కావటమే దీనికి సమాధానంగా చెప్పి తప్పించుకో జూసారు మరి కొందరు. దీని అర్థం కోసం వెదుకు లాడే ముందు కాండిన్స్కీ జీవితాన్ని ఆవిష్కరిద్దాం.

కాండీన్స్కీ 4 డిసెంబరు **1866**వ సం॥లో రష్యా దేశంలోని మాస్కోలో సంపన్నుల ఇంట జన్మించాడు. తండ్రి టీ వ్యాపారి, రెండు చేతులా సంపాదించాడు. రెండవ అలెగ్జాండర్ జార్ చక్రవర్తి పాలనా కాలం. **1864-69** సం॥ మధ్య టాల్‌స్టాయి రచించిన యుద్ధము-శాంతి కొన్ని భాగాలుగా విభజింపబడి సీరియల్‌గా వచ్చేది. పుష్కిన్, గొగోల్ తమ సాహితీ ప్రతిభతో మేధావులను ఓలలాడిస్తున్న అమృత ఘడియలవి. సంగీత వినువీధిలో బరోడిన్, ముసర్ గోస్కీలు (Borodin, Mussorgsky) తమదైన రీతిలో ఐరోపా సంగీతం రష్యాలోనికి చొర బడకుండా ఆనకట్ట వేశారు. అప్పటి వరకూ

కాం(డ్రేగుల నాగేశ్వరరావు, #5, దుల్హన్ ఎవెన్యూ-2, స్ట్రీట్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాదు-34

చిత్రకళలో రష్యన్ చిత్రకారులకు తమ దేశీయతనబడే శైలి లేదు (ఇందుకు మినహాయింపు జానపద శైలి. ఇది ప్రతి దేశ స్రవంతిలోనూ తప్పక వుండే విషయం). చిత్రకారుల నాదరించే ఉన్నత వర్గీయులు ఐరోపా చిత్రకళ నకళ్ళను మాత్రమే ప్రోత్సహిస్తూ వచ్చేవారు.

నాలుగు సంవత్సరాల లేత వయసులో తండ్రితో పాటుగా ఇటలీ ప్రయాణమప్పుడు చూసిన రింబ్రాండ్ చిత్రాలు జీవితమంతా ఒక తీపి గుర్తును మిగిల్చింది. రాముడు మంచి బాలుడన్న రీతిలో మాస్కో యూనివర్శిటీలో బుద్ధిగా జ్యూరిస్ ప్రూడెన్స్, ఆర్థిక శాస్త్రం అభ్యసించాడు. 1889వ సం॥లో ప్రభుత్వం తరుపున చదువులో ఒక భాగంగా జానపదుల సంప్రదాయం తెలుసుకోవడానికి తోటి విద్యార్థులతో కలసి ఓలోడా అనే గ్రామానికి వెళ్ళాడు. అక్కడున్నవారు తమ ఇంటి గుమ్మాలు రంగులతో అలంకరించుకున్నారు. వారు గుమ్మానికి తగిలించిన తెరలు, వారి దుస్తులు, పక్కదుప్పట్లు, ఎక్కడ పడితే అక్కడ, ఆ జానపద జీవన రీతిలో జమిలిగా కలసిపోయిన రంగుల ప్రపంచాన్ని చూశాడు. ఒక రంగుల కల జీవం పోసుకున్నట్లు తాను అందులో తిరుగాడినట్లుగా అనుభూతిని పొందాడు. చిన్నతనంలో తనలోనే అణగార్చుకున్న చిత్రకళా ప్రియత్వం అలానే వుండిపోయింది. మాస్కో యూనివర్శిటీలో 'లా' కాలేజీలో అధ్యాపకునిగా నియమితుడైనా మనస్సు పదే పదే మళ్ళడంతో అధ్యాపక వృత్తికి గుడ్‌బై చెప్పి లేటు వయస్సులో చిత్రకళ వైపు దృష్టి మళ్ళించాడు.

రష్యా వదలి మ్యూనిక్ నగరం చేరుకొని అక్కడవున్న అజ్‌బీ (Azbe) స్కూలులో విద్యార్థిగా నమోదు చేసుకున్నాడు. క్లాసులో చెబుతున్న సిద్ధాంతాలు నిరాశను మిగిల్చాయి. క్లాసు రూమును విడచి తనకు తానుగా వర్ణ ప్రపంచం లోకి వెళ్ళాడు. అతని రంగుల పిచ్చి, అధ్యాపకులకు గాని, తోటి విద్యార్థులకు గాని ఎవరికీ నచ్చలేదు. ముద్దలు ముద్దలుగా రంగులు వేయటం అనాగరిక చర్యని కొట్టిపడేశారు. దానితో అందరితో తెగ తెంపులు చేసుకొని తన భావ వ్యాప్తి కోసం Phalany Group అనే క్లబ్‌ను మూడు సంవత్సరాల పాటు నడిపాడు. అదే సమయంలో ఆర్ట్‌నోవో శైలిపై అభిమానం పెరిగింది. అక్కడే తన ప్రియురాలైన గాబ్రియల్ ముంతర్‌తో పరిచయం ఏర్పడింది. ఈ ప్రణయ కలాపం మొదటి ప్రపంచ యుద్ధపు తొలిరోజుల వరకూ కొనసాగింది.

చిత్రకళలో క్రమేపీ ఒంటరి అయ్యాడు. తన ఆలోచనలను పంచుకునే వ్యక్తి ఎవరూ లేక పోవటంతో సిద్ధాంత బందీలైన సమాంతర భావంతో నిండిన కళాశాలను విడచి బయటకు వచ్చేలా చేసింది. ఈ సమయంలో మోనేట్ (Monet) వేసిన గడ్డి వాములు (Haystacks) చిత్రం అతనిపై గాఢ ముద్ర వేసింది.

నిజానికి జర్మనీలోని మ్యూనిక్ చిత్రకళ విషయంలో చాలా వెనుక బడ్డ దేశంగానే చెప్పుకోవాలి. అప్పుడు ఐరోపా ఖండాన్ని ఉర్రూతలూగిస్తున్న ముద్రణావాద (ఇంప్రెషనిజపు) శైలి ఈ దేశంలో ఏ విధమైన ఇంప్రెషన్‌ను కలగజేయలేక పోయింది. పాత తరహా సహజ, కాల్పనిక శైలిలోనే అక్కడ చిత్రకళ కొనసాగుతుంది. జర్మనీ భాష అంతగా రాని కాండిన్స్కీ, అతని అమ్మమ్మ చెప్పిన మంత్ర తంత్రాల

జానపద గాథలు అతని మస్తిష్కంలో తిష్టవేశాయి. ఆ ప్రభావం నుంచి అతను ఎప్పటికీ బయట పడలేక పోయాడు. దీనితో అతని ఆత్మకథలో సైతం కొన్ని కల్పిత నాటకీయ సంఘటనలు, అతిశయోక్తులు ప్రవేశించాయి. చిత్రకళలో అతనికి లభించని గుర్తింపు ప్రియురాలు గాబ్రియల్ పొందగలిగింది.

1903వ సం॥లో దేశ సంచారం చేశాడు. పారిస్, వెనిస్, టూనీషియా, ఎన్నో ప్రాంతాలు చుట్టివచ్చాడు. కొంత దూరం నడక, కొంత దూరం బండి, కొంత దూరం స్టీమరు, కొంత దూరం గుఱ్ఱం - ఇలా సాగిన ఆ ప్రయాణంలో అతనికి ప్రజల వేష భాషలలో, ఇండ్లపై, ఇండ్ల లోపల అతనికి కనిపించినవి రంగులు, రంగులు, రంగులు, అంతే ఇంక వేరే ఏమీ కానరాలేదు. ఈ రంగులు అతనిపై దాడి చేశాయి, అతన్ని లొంగ దీసుకున్నాయి, చివరకు అతనిపై విజయం సాధించాయి. అతని జీవితంలో, అతని చిత్రాలలో కేంద్రీకృతమైన ముఖ్య సిద్ధాంతం అంటూ ఏమైనా వుంటే అవి రంగులే, అతని ప్రపంచమంతా రంగుల మయమే. క్రమేపీ అతను వేస్తున్న చిత్రాలలో క్రమేపీ వస్తువు మరుగవుతూ వచ్చింది. కొంత కాలానికతను రంగులను ప్రాథమికమైన రేఖలనూ తప్ప వస్తువును చూడలేని స్థితికి వచ్చాడు. అంతగా వ్యామోహ పీడితుడై, గతితప్పిన ఈ వర్ణ వ్యామోహమే కాండిన్స్కీని ఒక ప్రత్యేక శైలికి వైతాళికున్ని చేసింది.

1908వ సం॥లో ముర్నావ్ అనే చిన్న పల్లెలో ఇల్లు తీసుకొని నివసించాడు. ఒకనాడు అసంపూర్ణంగా ఉన్న ఒక చిత్ర అవశేషంలో అతనికి అద్భుతమైన రంగు, రంగుల అందాలు కనిపించాయి. పూర్తికాని ఆ చిత్రానికి కొత్త అందాలనిస్తున్నాయి. ఇక వస్తువుతో పనేమిటి? సంగీతానికి (ముఖ్యంగా మ్యూజికల్ కన్‌సర్ట్స్‌కు) వస్తు సంబంధి కానపుడు, చిత్రకళకు మాత్రం వస్తువు ఎందుకు అవసరం అవుతుంది. వస్తువు నుంచి వేరు చేసి చిత్రకళను శుభ్రపరచాలి. వస్తువు చిత్రకళలోని సౌందర్యాన్ని మభ్యపరుస్తుంది. నిజమైన కళకు వస్తువు ప్రతిబంధకం. ఈ ధృఢ నిశ్చయం అతనికి వేయి ఏనుగుల బలాన్నిచ్చింది. ఇప్పుడతను ఎటువంటి విమర్శనయినా ఎదుర్కొనడానికి సిద్ధం. 1910వ సం॥లో వస్తువులేని మొదటి అమూర్త చిత్రాన్ని ప్రదర్శించాడు ('మిసిమి' ముఖచిత్రం). ఆ తరువాత 1913లో కొంత కాలం వరకు అమూర్త చిత్రకళను ఒక వైపు నుంచి వేస్తూ, మరొకవైపు వస్తువుతో కూడిన చిత్రాలను కూడా వేశాడు. అటువంటి చిత్రాలలో ప్రముఖమైనది మాస్కో నగరంలో స్త్రీ (1912) (మిసిమి రెండవ అట్టపై చిత్రం).

కాండిన్స్కీ భావజాలాన్ని వ్యతిరేకించే మరొక ప్రఖ్యాత చిత్రకారుడు విమర్శకుడయిన అటోఫిషర్, A painting without subject is absurd అని వాఖ్యానించాడు. "చిత్రానికి ప్రాణంలాంటిది వస్తువు, దాని ఆధారంగానే చిత్రం పుడుతుంది, అందులోని విషయం ఆ వస్తువు చుట్టూ పరిభ్రమిస్తుంది, వస్తువులేని చిత్రం ప్రాణం లేని జీవం లాంటిది." ఎన్నో తీవ్ర ఆరోపణలను ఎదుర్కొన్నాడు. ఎందరికో అతనొక ఉన్మాదిలా కనిపించాడు. ఛిద్రమైన కుటుంబ వ్యవస్థ నుంచి వచ్చిన వారు మాత్రమే ఇటువంటి శైలిని ఆవిష్కరిస్తారని చాలా మంది ఈసడించారు. అందరూ అనుకున్నట్లుగా కాండిన్స్కీ అనార్కిస్టు కాదు, నిరాశావాది అసలే కాదు, అతను విద్యాధికుడు, సామాజిక జీవనంలో నియమ నిబంధనలనూ, నిబద్ధతనూ ఆశించినవాడు.

తనపై వచ్చిన విమర్శలకు సమాధానమిస్తూ కాండిన్స్కీ, "అన్ని శైలుల కంటే నా శైలి భిన్నమైనదేకాదు, కష్టతరమైనది కూడా. నాగరికత ఎప్పుడూ స్థిర బిందువు కాదు, అది వికాసం పొందుతూనే ఉంటుంది. ఒక్కో దశలో, ఒక్కోరకమైన ఆలోచనలు వుంటాయి, దాని ననుసరించే కళలు మార్పు చెందుతాయి, చెందాలి కూడ. కళలలో ఏ శైలి శాశ్వతం కాదు, కారాదు, అలా ఏదైనా స్థిరత్వాన్ని సిద్ధించుకుందంటే కళకు అంత్యక్రియలు జరిపించటమే. కళ నవనవోన్మేషణమైనది. కొత్త ఆలోచన మొదటిసారిగా వచ్చినప్పుడు అది తీసుకొని వచ్చిన కళాకారుణ్ణి అంతా పిచ్చివాడంటారు, తరువాత నెమ్మదిగా గుర్తిస్తారు. చివరికి దానినే స్వీకరిస్తారు. మనస్సును సంప్రదాయపు బానిసత్వపు నీడ నుంచి విడుదల చేయాలి. అప్పుడే అది భవిష్యత్తులోకి మనుగడ సాగిస్తుంది. మెదడు, మనస్సు, నేర్పు, మనో భావాల సంగమంగా సాగే ఆధ్యాత్మిక చలనమిది. అంతే తప్ప ఇది దారీ తెన్నూ లేని ప్రయాణం కాదు. నిర్దుష్టమైన మజిలీని చేరుకునే మార్గమిది" అంటూ వివరణను ఇచ్చారు (1912లో కాండిన్స్కీ వ్రాసిన (Concerning The Spiritual in Art నుంచి) 1911 నాటికి ప్రసిద్ధ చిత్రకారులయిన ఫ్రాంజ్ మార్క్ (Franz Marc), పాల్ క్లీ (Paul Klee), ఆర్ప్ మేక్ (Arp Mach) కాండిన్స్కీతో చేతులు కలిపారు. అతనితో కలిసి తమ చిత్రాలను ప్రదర్శించారు. 1914లో మొదటి ప్రపంచ యుద్ధం ఆరంభం కావటంతో తిరిగి మాస్కో చేరుకున్నాడు. 1917లో ప్రియురాలైన గాబ్రియల్‌ను వదలి నీనా అనే ఆమెను వివాహం చేసుకున్నాడు.

1920 ప్రాంతంలో ఏర్పడ్డ రష్యన్ బోల్షివిక్ విప్లవకారులు, సోషలిష్టు ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆధునిక చిత్రకారులను గౌరవించారు. అందులో భాగంగానే మాస్కోలో ఏర్పరచిన "అకాడెమీ ఆఫ్ ఆర్టిస్టు"ల కతన్ని ఉపాధ్యక్షుని చేసి గౌరవించారు. రష్యాలో 19కొత్త మ్యూజియంల స్థాపనకతను నడుం కట్టాడు. ఈ ఆనందం ఎంతో కాలం నిలువలేదు. రష్యా ప్రభుత్వంలో ముఖ్యవ్యక్తిగా ఉన్న ట్రోటస్కీ గందరగోళంగా కనిపించే ఈ శైలికి వ్యతిరేకంగా గళం విప్పాడు. అతని స్వరంతో గొంతు కలుపుతూ లెనిన్, "ఎంత ప్రయత్నించినా, నేను దీనిని అర్థం చేసుకోలేక పోతున్నాను, దృశ్య పరంగా ఇది నాకు అనుభూతిని గాని, ఆనందాన్ని గాని కలుగ జేయటం లేదని" చెప్పటంతో తాను రష్యాలో మనుగడ సాగించటం కష్టమని భావించిన కాండిన్స్కీ జర్మనీ చేరుకున్నాడు.

1921 నుంచి జర్మనీలోని బెర్లిన్ నగరంలో 'బౌహస్' (Bauhaus) అనబడే కళా కేంద్రంలో కళకు సంబంధించిన ప్రాథమిక సిద్ధాంతాలను భోదిస్తూ అక్కడే ఉన్నాడు. 1928వ సం॥లో జర్మనీ పౌరసత్వం లభించింది. 1933లో అధికారంలోనికి వచ్చిన నాజీ పార్టీ అతని మేధావితనంలో తెలియని భయాలు ఏర్పడ్డాయి. అభద్రతా భావంతో అక్కడ వుండలేని కాండిన్స్కీ పారిస్ చేరుకొని జీవన చివర ఘడియ వరకూ అక్కడే వుండిపోయాడు. ఆధునిక చిత్రకళా శైలిపై ఏహ్యాభావంకల హిట్లర్ ఆదేశాలపై కాండిన్స్కీ వేసిన 57 చిత్రాలను సేకరించి, పికాసో, బ్రేక్ మున్నగువారి చిత్రాలతో కలిపి, 1937వ సం॥లో చిత్రకళను భ్రష్టుపట్టిస్తూ పక్కదారి పట్టిస్తున్నాయన్న అభియోగంతో బెర్లిన్ వీధి మొగలో అందరి సమక్షంలో తగుల బెట్టించాడు. అవి తగుల బడటానికి ముందు కొన్ని రోజుల పాటు ఈ చిత్రాల ప్రదర్శన ఏర్పాటు చేసినప్పుడు, దేశం నలుమూలల నుండి వచ్చిన జనం వాటిని విరగబడి చూశారు.

1934వ సం॥లో ఫ్రెంచ్ ప్రభుత్వం అతనికి పౌరసత్వం ఇచ్చేనాటికి అతను లబ్ధ ప్రతిష్టుడు. 1944 డిసెంబరు 13వ తేదీన పారిస్‌లోని తన స్వగృహంలో తనదైన రంగుల లోకానికి నిష్క్రమించాడు కాండిన్స్కీ.

కాండిన్స్కీ చిత్రాలలో కనిపించే విచిత్ర తత్వం, అతని వ్యక్తిగత జీవితంలో కనిపించదు. అతనొక వ్యక్తికాదు, అతనొక సమూహం. అతనొక జ్ఞాన తృష్ణ కలిగిన విద్యార్థి. ఒక శాస్త్రజ్ఞుడు, ఒక కళాభిమాని, అంటీ ముట్టనట్టు వుండే విరాగి. అతను స్నేహశీలే కానీ చెప్పదగ్గ స్నేహితులంటూ అతని కెవరూ లేరు. అతనికి ఏకాంతం ఇష్టం. ఏ విషయంలోనూ, ఎప్పుడూ, ఎవరితోనూ రాజీపడని మనస్తత్వం. తనకు కావలసింది సాధించేవరకూ కొనసాగించే పట్టుదల వున్నవాడు. సగం ఆసియా వాసి, సగం ఐరోపా వాసి. మాటలలో తీవ్రవాది. సమాజ రీతి, రివాజు పాటించటంలో వినయశీలి. జర్మనీలో అధ్యాపకునిగా వున్నప్పుడు విద్యార్థులతనిని హెర్గట్ అని పిలిచేవారు (Hergott = జర్మనీ భాషలో 'మహా ఘనత వహించిన వారు' అనే పదం, వెక్కిరింపుగా).

అతనిలో ఆధ్యాత్మిక పరమైన ఆలోచనలెక్కువ. జర్మన్ రచయితలైన స్టీన్, గోథేల రచనలతో ప్రభావితుడు. జేమ్స్ జాయస్ రచనలలోని చైతన్య స్రవంతి అతనికిష్టం. కొన్ని రంగులకు, మానసిక భావోద్వేగాలకు అవినాభావ సంబంధం వుందని నమ్మినవాడు. చిత్రాలలోనే కాదు, రచనలలోనూ అతనిది నారికేళ పాకమే, ఏదీ ఓ పట్టాన అర్థంకాదు.

"His metaphysics are frequently unpenetrable, and his arguments un clear" అతని అతి భౌతిక వాదం ఎవ్వరు చొరబడలేనిది, అభిప్రాయాలలో స్పష్టత లోపిస్తుంది.

అతని రచనలు చిత్రకళకే కాదు, అదే ధోరణిలో సాగే ఇతర కళా ప్రక్రియలకు కూడా ఒక మార్గదర్శిలా ఉపయోగ పడుతుంది.

20వ శతాబ్దంలో తమకేం కావాలో తెలియక నూతనత్వం కోసం, అది ఏ రూపంలో వున్నా ఎంత అర్థ రహితంగా వున్నా స్వీకరించే అవంతిగార్డ్ బృందం క్యూబిజం, సర్రియలిజాన్ని ఇష్టపడినంతగా కాండిన్స్కీ చిత్రాలను స్వీకరించ లేక పోయారు. అతన్ని నవోదయ చిత్రకారునిగా మాత్రమే గుర్తించారు. సూర్యోదయ సూర్యాస్తమయాలు, ప్రకృతి దృశ్యాలు, పేలవమైన స్త్రీ నగ్న చిత్రాలతో విసిగిపోయిన మాకు కాండిన్స్కీ చిత్రాలు ఉత్సాహాన్ని కలిగించాయి. కళను స్థిరం కాకుండా, అనంత పోకడలకు తీసుకోని పోయి, కళా ప్రపంచాన్ని విస్కృత పరచి, కొత్త లోకాన్ని చూపించాడని, వారు పేర్కొన్నారు.

సిద్ధాంతాలకంటే ఆలోచనలు గొప్పవి. చిత్రాలు ముందు పుడతాయి. అవి మనకి నచ్చితే దానిని సమర్థిస్తూ సిద్ధాంతాలను రూపొందించు కుంటాం. ప్రతి మనిషికి తనదైన ప్రత్యేక అవ్యక్త వ్యక్తీకరణ లుంటాయి. అవి విడుదల కోరుకుంటాయి. అలా చేయగలగడమే ప్యూర్ ఆర్ట్స్. కళ మన కోసం వుంది. మనం కళ కోసం కాదు. భావ వీధిలో సంచరించే సంగీతానికి నా చిత్రకళతో రూప మిచ్చానన్నాడు కాండిన్స్కీ. (ఈ నెల మిసిమి నాలుగు అట్టలపై చిత్రాలు వీరివే)

# సమాజ సంకీర్ణతల మధ్య బౌద్ధం విస్తరిస్తుందా?

- ముంగర జాషువ

మనం నడిచే ఇరుకు దారుల నుంచి, మన ఇరుకైన మానసిక పరిస్థితుల నుంచి కొన్ని మతాలు విస్తరించడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి గాని, అటువంటి పరిస్థితుల నుంచి బౌద్ధ ధర్మం వికసించదు, విస్తరించదు కూడా! ఏది ఏమైనా, సమాజంలోని అనేక సంకీర్ణతలు బౌద్ధ ధర్మానికి అనుకూల పరిస్థితులు కావు. బౌద్ధ ధర్మంలో కరుణ, దయ, జాలి, ప్రేమ, విచక్షణ, వివేకం, తార్కికత, సత్యాన్వేషణ లాంటి ఉత్తమ లక్షణాలు మెండుగా ఉండటం వలన, బౌద్ధం యొక్క పరిణిత ప్రబోధాన్ని అందుకోవడానికి ఒక ఉత్తమ సంస్కారం యొక్క శకలమైనా మనలో వుండవలసిన ఆవశ్యకత ఉంది. మన చుట్టూ వున్న వెలుగు నీడలను (light & shadow) చూడటానికి ఏ విధంగా దృష్టి అవసరమో, బౌద్ధ ధర్మం అవగతం కావడానికి ఒక సంస్కార దృష్టి అవసరం అనే విషయాన్ని అన్ని వర్గాలు గుర్తించవలసిన ఆవశ్యకత చాలా ఉంది.

వర్తమాన సమాజంలో భిన్నవర్గాలు మతమౌఢ్యం, కుల జాఢ్యం యొక్క ప్రేరణలతో, భిన్న రాజకీయ వర్గాల అస్తవ్యస్త దృక్పధాలతో, సెల్యులాయిడ్ శక్తులతో పని చేస్తూ యావత్ సమాజాన్ని సంకీర్ణతల మయం చేస్తున్నారు. ఇటువంటి సంకీర్ణతల మధ్య, శీల, సమాధి, ప్రజ్ఞ లాంటి మహనీయ విలువలకు ప్రాధాన్యతనిచ్చే బౌద్ధం విస్తరిస్తుందా? మానవ మానసాల్లో బౌద్ధ ధర్మం వికసిస్తుందా? అనే ప్రశ్నలకు ప్రాధమికమైన సమాచారాన్ని అందించడమే ఈ వ్యాసోద్దేశ్యం.

సమాజంలో అణగారిన మానవ సంబంధాలు, ధనార్జనే నైతిక సూత్రంగా పని చేస్తున్న రాజకీయ, అధికార, వాణిజ్య వర్గాలు, విధ్వంసానికి వెన్నుగాచే కులవాదం, మనువాదం, మతవాదం, తీవ్రవాదం, ఉగ్రవాదం దేశ కేంద్ర స్థానంలో కూర్చొని అనార్కిజాన్ని ప్రతి క్షణం సృష్టిస్తున్నాయి. సమాజంలో ప్రధానమైన దళిత, వెనుకబడిన వర్గాలు, పేదరికం, అవిద్య, అర్ధాకలి లాంటి వాటితో సతమతమౌతుంటే, మధ్య తరగతి వర్గం వస్తుప్రీతిని పెంచుకుంటూ, ఆస్తి అనే కేంద్రకం చుట్టూ గిరికీలు కొడుతుంది. సంపన్న వర్గాలు భూదాహంతో (Real Estate Mania) షేర్ జూదంతో, పెట్టుబడిదారీ తత్వంతో రాజకీయాధికారం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాయి.

ఆయా వర్గాలలో ఎక్కువ శాతం వారికి, మత దృక్పథం గురించి, నైతిక విలువల గురించి, ఆలోచించే దశ వుంది గాని, అనర్గళంగా మాట్లాడే స్వభావం ఉందిగాని, ఆచరించే తీరుబడి, ఉద్దేశ్యమూ లేదు. కొంతమంది ఆలోచనా పరులు చాంధస వాదాల పునరుద్ధరణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. దీనర్థం సమాజం యావత్తూ చీకటిలో వుందని కాదు. అన్ని వర్గాలలోనూ, సమరసభావం, విమలత్వం, చింతనాసక్తి కలిగిన వారు లేకపోలేదు. అటువంటి వారివల్లనే సమాజం యొక్క రూపురేఖలు వికృతి పొందకుండా మనకు ఒక క్రమం కనిపిస్తుంది, ఆశ్చర్యకరంగా!

మన సమాజాన్ని శాసించే ఏ పార్టీ ప్రభుత్వాలైనా, అందరి సంక్షేమానికి పని చేస్తున్నట్లు కనిపిస్తూ, కొన్ని వర్గాలకు తాత్కాలికంగా తాయిలాలు అందిస్తూ, ఓటు బ్యాంకులను వృద్ధి చేసుకొనే క్రమంలో, మత పెద్దలను, మఠాధి పతులను దువ్వుతూ, పోరాడే వర్గాలను బుజ్జగిస్తూ, సమస్యలనన్నిటినీ ఆర్థిక

---

ముంగర జాషువ, B/2038, కెనాల్సు, హిల్‌కాలని, నల్లగొండ జిల్లా.

కోణం నుంచి చూస్తూ, తమ గడువును వెళ్లదీస్తున్నవి. సమాజంలో నైతిక దృక్పథాన్ని కలిగించి, ఒక సంస్కారయుత సమాజ నిర్మాణంలో భాగం కాకుండా పాలితులు-పాలకులు ఒకే పడవలో ప్రయాణం చెయ్యడం జరుగుతుంది. యథారాజా తథాప్రజా అన్న ప్రాచీన సూక్తి నిజమై కూర్చుంది. ఎందుకంటే పాలితులకు, పాలకులకు తక్షణావసరాల వత్తిడి, ఆవశ్యకత, బలీయమైన అంశంగా కన్పించడమే ప్రధాన కారణమైంది. ఇందుకు ఫలితంగా సరియైన ధార్మిక, నైతిక, తత్త్వదర్శనం లేని సమాజంలో మనం నివశిస్తున్నాం.

సామాజిక రుగ్మతలైన పేదరికం, అవినీతి, మద్యపానం, వేశ్యావృత్తి, నిరక్షరాస్యత, మాదకద్రవ్యాల ఉత్పత్తి, బాల్య వివాహాలు, బహు భార్యత్వం, అవిద్య, అజ్ఞానం లాంటి అనేక చీకటి గుణాలకు సరియైన చికిత్స లేకుండాపోయింది. ప్రభుత్వాలు, రాజకీయ పక్షాలు, మతవాదులు, పీఠాధిపతులు ఏదో వైద్యం చేస్తున్నట్లు నటిస్తుంటారు. మూడు సంవత్సరాల పసిపాప పశుకామానికి బలి అయితే, ఇటువంటి దురాగతాలను అరికట్టవలసిన వర్గాలు తాపీగా, నిర్లిప్తంగా, యాంత్రికంగా సాగిపోతున్నాయి. ఇంతకన్నా అరాజకత్వానికి ఉదాహరణ ఏముంటుంది? ఇటువంటివి ప్రతి నిత్యం జరిగే సామాన్య విషయాలుగా భావించే సామాజికుల ఆలోచనా విధానం ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు.

ఇందుకు ప్రధాన కారణం, సమాజంలో అసమగ్రమైన మత దృక్పథాలు అనేకం ఉన్నవిగాని బౌద్ధ ధర్మం లాంటి బలమైన తాత్విక దృక్పథం వేళ్ళూనకపోవడమే! బెర్ట్రాండ్ రస్సెల్, జిడ్డు కృష్ణమూర్తి, నీషే లాంటి వారు చెప్పిన మంచి విషయాలు, తాత్వికాంశాలు అనేకం ఉన్నవిగాని, బౌద్ధ ధర్మం అంత వ్యవస్థీకృతమై, సామూహిక మార్పులను కలిగించడంలో ఎక్కువ ప్రభావ శీలి అయిన సిద్ధాంతాలుగా అవి సామాన్యుని జీవిత రంగం పైకి రాలేక మేధోజీవుల మస్తిష్కాలలో నిలచిపోయాయి.

సమాజానికి భౌతికాభివృద్ధి ఎంత అవసరమో, తాత్త్విక ఆలోచనా సిద్ధి అంత అవసరం. మనకు ఆధునిక, భౌతిక అవసరాలు ఎంత ముఖ్యమో, మానసిక తాత్త్వికావసరాలు అంతే ముఖ్యం. ధనార్జనే ధ్యేయంగా తిరిగే అతిస్వార్థాన్ని అణచడానికి, అతి దారిద్ర్యాన్ని అరికట్టడానికి, బలవంతుడిదే రాజ్యం అనే నినాదాన్ని రూపు మాపడానికి సామాజిక న్యాయం అందరికీ అందుబాటులోకి రావడానికి "మధ్యే మార్గాన్ని" ప్రబోధించే బౌద్ధ ధర్మం సమాజంలో విస్తృతంగా విస్తరించవలసిన ఆవశ్యకత ఉంది. అయితే ఈ బౌద్ధ ధర్మం ఆధునిక తత్త్వానికి, ఆచరణకు అందుబాటులో ఉండాలి. బౌద్ధ ధర్మం Stagnated కాదుగనుక, గతిశీలత కలిగింది గనుక, ఆ విధంగా ఉంటుంది కూడా!

పూర్వం దళిత, వెనుకబడిన వర్గాలు అణగ ద్రొక్కబడటం, వారి నిస్సహాయతను సమాజంలోని మిగతా వర్గాలు ఉపయోగించుకోవడం, వారిని బానిసలుగా, ఓటర్లుగా చూస్తున్న తరుణంలో బాబాసాహెబ్ డా॥ అంబేద్కర్ "తన చూపుడు వేలుని" బౌద్ధ ధర్మం వైపుకి చూపించి లక్షలాది మందిని బౌద్ధంలోకి మార్చి, తేజోవంతమైన బౌద్ధ తాత్విక సూత్రాల విశ్లేషణలతో పీడితావళిని ముంచెత్తారు. దళితులకు హిందూ, క్రైస్తవ మతాలకన్నా, బౌద్ధం హృదయానికి దగ్గరయ్యే మతం అని, సమాజంలో దళితులు తలెత్తుకు తిరగడానికి బౌద్ధ ధర్మం కన్నా అన్యం లేదని రాజ్యాంగ నిర్మాత గుర్తించి, దళితులకు ప్రబోధించారు. దళితుల దురదృష్టవశాత్తూ ఆయన జీవన దీపం అర్థంతరంగా

కొడిగట్టడంతో బౌద్ధ ధర్మం అంతగా విస్తృతం కాలేకపోయింది. మరలా ఆ స్ఫూర్తిని భారత దేశంలోని దళిత సంఘాలు, మేధావులు అందుకొని నెమ్మదిగా ఆ దిశలో ప్రయాణిస్తున్నారు.

ఎవరు ఏ విధంగా ప్రయాణించినా, మనకు ప్రచార రథాలకన్నా, ప్రచార సామాగ్రికన్నా, బౌద్ధ తాత్వికా చరణ ఉన్నవారి ప్రభావం సమాజంపై ఎక్కువ గాఢతను కలిగి ఉంటుందనే సత్యాన్ని మరువగూడదు.

తొలితరంలో వైదిక మత ప్రభావం కలిగి ఉన్నప్పటికీ, వస్తు గౌరవాన్ని బట్టి, ప్రఖ్యాతులైన తిరుపతి వేంకట కవులు, పింగళి-కాటూరి, కరుణశ్రీ, దాశరధి, బోడేపూడి వేంకటరావు, జ్ఞానానంద కవి, లాంటి కవులు, బుద్ధుని జీవితాన్ని, బోధనలను సాహితీ రూపాల ద్వారా అమరత్వాన్ని కలిగించారు.

ప్రముఖ కవి పండితుడు స్వామి శివశంకర శాస్త్రి జాతక కథలను అనువదించి, కళా తత్త్వవేత్త డా॥ సంజీవదేవ్ బౌద్ధ కళలను గురించి, డా॥ జి.వి. కృష్ణరావు బౌద్ధ తత్త్వాన్ని గురించి, ఇంకా అనేకులు విస్తృతంగా రచనలు చేశారు.

ఆంధ్ర దేశంలో ఎవ్వరు ఏ కృషి చేసినా అది అంతా బౌద్ధ కళలను గురించి బౌద్ధ ధర్మం యొక్క విశిష్టతలను వెలువరించే క్రమం గనుక అందరికీ ఆమోదయోగ్యమౌతుంది. Media పరంగా 'మిసిమి, ధమ్మప్రభ, లాంటి పత్రికలు, అడపాదడపా ఆంధ్రప్రదేశ్ పత్రిక, పలువురు బౌద్ధ దార్శనికులు, మేధావులు, రచయితలు నిర్మాణాత్మక కృషి సాగించడం వలన బౌద్ధం గణింప దగిన స్థాయిలో వుంది. ఈ మహత్తర కృషిలో భాగస్వాములై వారిలో "ఆంధ్రా అశోకుడు" అని పేరుబడిన సి. ఆంజనేయ రెడ్డి నిశ్శబ్ద కృషి, బౌద్ధదార్శనికుడు, బౌద్ధ విజ్ఞాన సర్వస్వం గ్రంథ కర్త అన్నపరెడ్డి వేంకటేశ్వరరెడ్డి, ఇంకా బౌద్ధ రచయితలు జె. రఘుపతిరావు, జితేంద్ర బాబు, శశికుమార్, డా॥ కత్తి పద్మారావు, సవేరా, గూటం స్వామి లాంటి వారు, కృష్ణార్జున బోధి, దొమ్మేటి సత్యనారాయణ బోధి లాంటి ధర్మ ప్రచారకులు, ఇంకా నాకు తెలియని ఎందరో రచయితలు, ఉపాసకులు, అష్టాంగ మార్గాన్ని, దుఃఖోపశమన మార్గాన్ని, ధ్యాన, మనన, సంయమనాలతో రాష్ట్రం అంతటా విస్తరింప జేస్తున్నారు.

ప్రస్తుతం ఆనంద బుద్ధ విహార్ (సికింద్రాబాద్) బౌద్ధ భిక్షులు శాసన రక్షిత, వినయ రక్షితల అంకిత సేవ విలువ కట్టలేనిది. పురావేత్త, బౌద్ధ రచయిత, ఇంకా అనేకం అయిన ఆచార్య ఈమని శివనాగిరెడ్డి నేతృత్వంలోని "బుద్ధవనం"- (నాగార్జునసాగర్) లాంటి ఆరామాలు త్వరలో క్షుభిత హృదయాలను, సంక్షుభిత జీవితాలను బౌద్ధ ధర్మంతో ఊరడించడానికి సిద్ధమౌతున్నవి. ఆచార్య నాగార్జునుడు, ధర్మకీర్తి, దిగ్నాగుడు లాంటి మహామహుల స్వప్నాలను, మన బౌద్ధ దార్శనికులు, మేధావులు ఆంధ్రదేశంలో బహుళంగా విస్తరింప జేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ బౌద్ధారామాలలో, మారుమ్రోగే త్రిశరణాలు, గాయపడిన హృదయాలను, అర్ధాకలితో అలమటించే పేదలను, సమాజ దౌర్జన్యానికి మౌనం వహించే పీడితులను, పురుషాహంకారానికి బలిఐై రోదించే స్త్రీలను, దిక్కులేని వీధి బాలలను, దీనులైన యాచకులను, గుప్పెడు మెతుకుల కోసం హీనులైన అభాగినులను, ఇంకా లక్షలాది పీడితులను ఓదార్చి, సేదదీర్చి, సమాజ సంకీర్ణతలను అధిగమించి కాంతిని, శాంతిని సమాజానికి ప్రసాదిస్తాయని ఆశించడము, ధ్యానించడమూ సమంజసమూ, సహేతుకం కూడా!

# వినిర్మాణ నిర్మాత జాక్ డెరిడా

\- శివలింగం

జాక్ డెరిడా వామపక్షీయ యూదు దంపతులకు 1930లో ఆల్జీరియాలో జననం. 8-10-2004లో మరణం. 19వ సంవత్సరంలో ఫ్రాన్సు వెళ్లాడు. 1960 ప్రాంతంలో లూయిస్ ఆల్థూసర్, జాక్‌లకన్, జీఁపాల్ సార్త్ర, రోలండ్ బార్తెస్ గిల్లెస్ డెల్యూజ్, మైకేల్ ఫో కాల్ట్, పీర్‌బోర్డే, డెరిడాలు తాత్విక మేధావి వర్గంలో వెలుగులు విరజిమ్ముతున్న దివ్వెలు. డెరిడా మరణం పూరించలేని లోటు. పేంక్రియాటిక్ కేన్సర్‌తో బాధపడుతూ పరిసియన్ హాస్పిటల్‌లో చేరాడు. మరణ కారణం సెరిబ్రల్ హెమరేజ్ అని నిర్ధారించారు. ఎనభై పుస్తకాలు ప్రచురణ పొందాయి. అతని రచనల మీద విస్తృతంగా చర్చలు జరిగాయి. దూషణ భూషణలు భరించాడు. వెయ్యి పుస్తకాల్లో డెరిడా చెప్పిన విషయాలు ప్రస్తావించబడినాయి. తత్త్వశాస్త్రంలో, సాహిత్యంలో, విమర్శలో పదిహేను సంవత్సరాల కాలంలో పద్నాలుగు వేల సార్లు డెరిడాను పేర్కొనడం జరిగిందంటే ఆయన ప్రభావాన్ని గుర్తించవచ్చు. 20వ శతాబ్దపు ప్రతిభావంతులైన తాత్త్వికులు మార్టిన్ హైడెగ్గర్ (1889 -1976), ఎడ్మండ్ హాజరల్ (1859 -1938), కారల్ మార్క్స్ (1818 - 83), జాఁపాల్ సార్త్ర (1905 - 1980), మార్లో పొంటి (1908 -1961), ఫ్రాయిడ్‌ల ఆలోచనా ప్రభావం డెరిడాను నూతన తాత్త్విక భావాలవైపు పురికొల్పాయి. ఆతని ఉపన్యాసాలను విద్యార్థులు, సహ అధ్యాపకులు ఆసక్తితో ఆలకించేవారు. వాక్కులో ఆకర్షణశక్తి, సమ్మోహనా శక్తి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసేవి. శ్లేషలు, ప్రాసలు, నిగూఢ భావాలతో ఉపన్యాసాలు సాగేవి. ఫ్రెంచి తాత్విక సంప్రదాయాల్ని రాజకీయ కార్యాచరణను సమన్వయం చేసిన ఘనుడు. వామపక్ష రాజకీయ నిబద్ధత. జెకోస్లోవేకియాలో కమ్యూనిస్టు ప్రభుత్వం మేధావుల స్వేచ్ఛను అణచివేతను వ్యతిరేకించాడు. చార్టర్ 77ను సమర్థించాడు. అతని వినిర్మాణ (De Construction) సిద్ధాంతం బహుళ ప్రచారం పొందింది. అధికుల ఆమోదం లభించింది. సాహిత్య విమర్శ, భాషాశాస్త్రం, మానవ విజ్ఞాన శాస్త్రం, కళ, సంగీతం, వాస్తు, రాజకీయ శాస్త్రాలన్నిటిలోకి వినిర్మాణ వాదం ప్రవేశించింది. షేక్స్పియర్, గ్రీకు తాత్వికులను పునరధ్యయనానికి పునాదులు తీసింది, దాగి ఉన్న పక్షపాతాలు, వైరుధ్యాలను వెలికితీసింది. ఫలితంగా స్త్రీవాదులు స్తుతించారు. జాతి, జెండర్ వివక్షతలు వాచకా(Texts)ల్లో బయట పడడం కార్యాచరణ వాదులకు, దళితులకు ఆనందం కలిగించింది. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం డెరిడాకు గౌరవ డాక్టరేట్ ఇవ్వడానికి నిర్ణయించినపుడు కొందరు

యు. శివలింగం, పడమటి వీధి, చల్లపల్లి - 521 126

వ్యతిరేకించారు. ఓటింగు పెడితే 336-204తో డెరిడా గెలిచాడు. జీవితాంతం వరకు హార్వర్డు యూనివర్సిటీలోను, ప్యారిస్‌లోని సార్‌బోన్ యూనివర్సిటీలోను ఉపన్యసించాడు. 1987లో ఒక ఉదంతం బయటపడింది. అగ్రగణ్య మేధావి, డెరిడా గురుతుల్యుడు అయిన హైడెగర్ 1933 నుండి 1945 వరకు నాజీ పార్టీ ప్రచార భారం మోసాడు. అయితే డెరిడా హైడెగర్ గతాన్ని విమర్శించాడు. కాని ఆయన తాత్విక కృషి ప్రామాణికతకు అది అవరోధం కాదన్నాడు.

ఒక ఇంటర్వ్యూలో 'One of the caronations of this messianism without religion may be found in the alter - globalisation movements అన్నాడు. ప్రపంచీకరణ పక్కదారి పడుతుంది, ఉపయోగించు కోవడంలో విఫలమవుతున్నాయి. మార్కెట్ పోటీకి తట్టుకుని దీటుగా నిలబడగలగాలి. అందరికీ పురోగతి, పేదలకు రక్షణ లక్ష్యంగా ప్రపంచీకరణ ఉన్నప్పుడే సత్ఫలితం.

హెగెల్, హుజరల్, హైడెగర్‌ల ఆలోచనలే డెరిడా తాత్విక రూపకల్పనకు దోహదం కలిగించాయని 1981లో చెప్పాడు.

డెరిడా వినిర్మాణం ప్లేటో భావాన్ని, అరిస్టాటిల్ శుద్ధ చింతనను, డేకార్ట్ ఆలోచనను, కాంట్ అతీంద్రియ చైతన్యాన్ని, హెగెల్ ఆత్మను ప్రశ్నిస్తుంది. ఆధునికత అనే పదం ఆయనకు ఎప్పుడూ సంతోషాన్ని కలిగించలేదు. నూతనత్వమనేది లేదు, అంతా పునరావృతమే, వినిర్మాణం అంటే 'The revenge of language on philosophy' అని వర్ణించాడు. డెరిడాకు అధి భౌతిక శాస్త్రం మీద అవిశ్వాసం. తత్వశాస్త్రం చేయాల్సిన పని ఒక సిద్ధాంతాన్ని నిర్మించడం కాదు, నిర్మూలించడమూ కాదు విస్మరించడం. శతాబ్దాల నుండి కర్త-కర్మల మధ్య, సత్తు-అసత్తుల మధ్య, భగవంతుడు-మానవుడు విశ్వాసం-హేతువుల మధ్య చర్చలు, పరిశోధనలు జరుగుతూనే వున్నాయి. అయితే పాశ్చాత్య అధి భౌతికశాస్త్ర మూలాల్ని ఛేదించి తద్భిన్నంగా నూతన నిర్మాణ ప్రమేయాన్ని ఇవ్వడంలో విఫలమయ్యాడు.

వినిర్మాణాన్ని విమర్శకుని మాటల్లో :

Deconstruction is to take an idea, an institution or a set of Values and to understand its mechanisms by removing the cement that constitutes it.

ప్యారిస్‌లో మేధోగత జీవితానికి విశ్వత్వాన్ని చేకూర్చాడు. నగర వాతావరణానికి దూరంగా సాదాసీదాగా వున్న రిస్ ఆరంగిస్ ప్రాంతంలోని ఇంటిలో నివసించాడు. స్నేహం, అతిథి సత్కారం, దాతృత్వం ఆతని విశిష్ట గుణాలు. గొప్ప ఆలోచనాశీలి మాత్రమే కాదు. అసాధారణ మానవుడు, అరుదైన వ్యక్తి.

# విశ్వనాథ - సౌందర్య జిజ్ఞాస

- డా॥ నరసింహమూర్తి

(గత సంచిక తరువాయి)

సౌందర్య కల్పనలో ఇది ఒక విచ్ఛిత్తి. ఇది సాధారణ సౌందర్యం కాదు, పాశ్చాత్య సౌందర్య తత్త్వజ్ఞులు దీనిని ఉదాత్త సౌందర్యం (Sublime) గా పేర్కొన్నారు. ఇందులో సౌందర్య సహజమైన మృదుత్వము, మాధుర్యము వంటి లక్షణాలు ఉండవు. ఒక అద్భుతత్త్వము, ఒక భీతి మౌలిక లక్షణాలుగా ఇటువంటి సౌందర్య స్ఫురణ కలుగుతుంది. ప్రాణి శరీరం పంచభూతాత్మకమైనది. ఆకాశము, గాలి, నీరు, నిప్పు, భూమి అనే శక్తులు ప్రాణి శరీరంలో వివిధ రూపాలలో ఉంటాయి. ఇది ప్రాణి సహజమైన శరీర ధర్మం. అయినా ఆ శరీరంలో పంచభూతాల ధర్మాలు లేశ మాత్రంగా ఉంటాయి. ఇక్కడ శూర్పణఖ శరీరం అలా కనిపపించడం లేదు. పంచ భూతాలు తమ సహజ విస్తృత రూపంలో తీవ్ర ధర్మాలతో కళ్ల యెదుట నిలిచినట్లుగా కవి శూర్పణఖ శరీరాన్ని వర్ణించాడు. ఇది కూడా ఒక సౌందర్య కల్పనే. ఇది అమూలకమైన కల్పన. వాల్మీకి శూర్పణఖ శరీరంలోని విరూప లక్షణాలన్నింటినీ మనకు వెగటు గొలిపేలా వర్ణించాడు. విశ్వనాథ ఆ విధంగా కాకుండా మనలనొక అద్భుతత్వం ఆవహించేలా, భీతి పెనగొనేలాగ వర్ణిస్తూనే అందులో కొంత సౌందర్యాన్ని నిక్షేపించాడు. ఇది కూడా సౌందర్య జిజ్ఞాసలో ఒక పార్శ్వమే. వాల్మీకి శూర్పణఖ వికృత రూపాన్ని వర్ణిస్తే విశ్వనాథ శూర్పణఖ ఉగ్ర సౌందర్య వర్ణన చేశారు. భారతీయుల సౌందర్య దర్శనంలో ఉగ్ర సౌందర్యానికి కూడా స్థానముంది.

సౌందర్య జ్ఞానానికి విచక్షణ ప్రధానం. ఆ విచక్షణననుసరించి విశ్వనాథ రామాయణంలో వాల్మీకి సృష్టించిన వివిధ పాత్రలను ఆయా పాత్రల ప్రధాన జీవ లక్షణానికి క్షతి కలుగని రీతిగా పునస్సృష్టి చేసారు. శూర్పణఖ పాత్ర కూడా అటువంటిదే. అది సౌందర్య లాలస గల పాత్ర. సౌందర్యానుభవం కోసం తహ తహలాడే పాత్ర. అయినా సౌందర్య జ్ఞానం విషయంలో తన విచక్షణను కోల్పోయినట్లు కనబడదు. తనకు జరిగిన భంగపాటుకు ప్రతీకారంగా రావణునితో సీతపై కామవాంఛ రగిలే విధంగా అతడి వద్ద సీత సౌందర్య ప్రశంస చేసి అతణ్ణి రెచ్చగొట్టడం ఆమె ఆశయం. సీత సౌందర్యం రాజ్య భ్రష్టుడై అడవుల పాలైన రాముని పరం చేసిన విధాతను ఛాందసుడని నిందిస్తూనే సీత సౌందర్య వర్ణన చేసేటప్పుడు ఆమె సౌందర్య జ్ఞానం పట్ల తనకు గల విచక్షణను ఇలా ప్రకటించింది. "తాతమ్మగారు సరస్వతీదేవి గారి సౌందర్య మెఱుగుదున, ఆలోచించిన కొలంది గాని యామె సౌందర్యము పొడకట్టదు, పరమ ప్రపితామహి భవాని సౌందర్య మెఱుగుదును, తదేక ధ్యాన నిష్ఠ గాని యామె సౌందర్యము సౌందర్య మనిపించదు. సంగీతము వలె నాపాత మధురమైన సీత సౌందర్యమే వేఱు."
(రామా, కల్ప - మారీచ : 71)

సరస్వతీ సౌందర్యం ఆలోచిస్తేనే గానీ తెలియదు. భవానీ సౌందర్యం తదేక ధ్యాన నిష్ఠవలన గానీ సౌందర్యంగా గుర్తించడం సాధ్యంకాదు. శూర్పణఖ ఈ ఇద్దరి సౌందర్యంలోని బహిరావరణాన్ని గుర్తించ గలిగిందే గానీ సత్యమైన అంత స్సౌందర్యాన్ని గుర్తించ లేక పోయింది. ఆమెకు ఆలోచనగానీ, నిష్ఠగానీ లేకపోవడమే అందుకు కారణమని ఇక్కడ ధ్వని. సౌందర్యం ఆనంద కారకమైనప్పుడు అది అశ్రమంగా అనుభవ యోగ్యమైనప్పుడే సర్వజన సుఖాస్పదంగా ఉంటుంది. అది అసలైన సౌందర్య లక్షణం.

డా॥ యు.ఎ. నరసింహమూర్తి, 8-30-7, సాయినగర్, తోటపాలెం, విజయనగరం - 535003.

సంగీతం విన్నంతనే దాని మాధుర్య లక్షణం అందరికీ అందుతుంది. అది ఎడతెగని మాధుర్యం, సీత సౌందర్యం కూడా అలాంటిదే. చూచినంతనే ఎటువంటి వారికైనా మనఃప్రహ్లాదనంకలిగిస్తుంది. ఎన్నటికీ మరపురాదు. ఇది నిజమైన సౌందర్య లక్షణమని గుర్తించగల విచక్షణ మాత్రం శూర్పణఖలో కనిపిస్తుంది. ఇదంతా విశ్వనాథ చూపు.

సౌందర్యంగా తాను గుర్తించిన సరుకు భగవంతుని నుండి సరఫరా అయిందని ప్రాగ్జన్మ సంస్కార వశాన తాను ఆ సంపూర్ణ సౌందర్యంలోని అంశగా అవతరించానని విశ్వనాథ ప్రకటించిన విషయం ముందు తెలుసుకున్నాం. విశ్వనాథ అద్వైతి అని, తాను సౌందర్యంగా గుర్తించిన భగవత్స్వరూపం కంటే భిన్నుడను కాడనే జ్ఞానాన్ని పొందాడు. ఆ కారణంగా భగవంతునిలో ఉండే సౌందర్యమనే ముడి సరుకు తనలో కూడా ఉందనే జ్ఞానం ఆయనకు కలిగింది. తనలోని సౌందర్యాన్నే తన కవన వ్యాపారంలో అభివ్యక్తం చేయడం తన లక్ష్యంగా ఎంచుకొన్నారు.

ఆలోచనము చేయ నునుపు తేరిన దవు ముడి సరకు
గా లోన నను నేన తెలుసుకొంటిని కాళియదమన!
లోలముల్ పదములఁ ద్రొక్కు నాల్క వెళ్ళుకొనియు వచ్చు
వేళగా నందమూర్కిలయ! సంతాన వేణుగోపాల!

(విశ్వనాథ, నందమూరు శతకం, పు : 3)

ఇక్కడ ఒక చమత్కారం కనిపిస్తుంది. తానెరిగిన సౌందర్యం భగవంతుని నుండి వచ్చిందన్నారు. తనను తాను సౌందర్య స్వరూపంగా గుర్తించనన్నారు. అలా గుర్తించిన సౌందర్యాన్ని యథాతథంగా కవితా రూపంలో వెలువరించే ముందు ఆలోచనతో దానిని నునుపు చేసానన్నారు. ఈ మాట దైవ కృపాలబ్ధమైన సౌందర్యానికి, కవి సృష్టించిన సౌందర్యానికి గల భేదాన్ని సూక్ష్మంగా సూచిస్తుంది. సౌందర్యాన్ని నునుపు తేర్చడమనే భావం మనోజ్ఞనమైనది. అది విశ్వనాథ వంటి కొద్ది మందికే సాధ్యం. భగవత్సౌందర్యాన్ని నునుపు తేర్చడమనేది సాధ్యమా! పూర్వజన్మ సంస్కారంతో కూడిన భ్రష్టయోగి దైవీయమైన సౌందర్యాంశని తనలో తాను చూసుకొన్న, దానిలో ఐక్యం చెందిన జన్మ కారణంగా సిద్ధించిన ఇహలోక వాసనా వలయం నుండి సంపూర్ణంగా బైటపడటం సాధ్యం కాదు. అదీ కాక కావ్యగత వస్తువు లౌకికమైనది. ఆ వస్తువు ఆధారంగా అలౌకిక సౌందర్య సృష్టి చేసి సహృదయునికి దివ్యము, సత్యము అయిన సౌందర్య దర్శనం లభింప చేయడానికి కవి ప్రయాస పడతాడు. తనలోని దివ్య సౌందర్యాన్ని తన సృజన ద్వారా సహృదయునికి అందించడమే కవి లక్ష్యం. ఈ లౌకికా లౌకిక దివ్య సౌందర్య భేదాలను దృష్టిలో ఉంచుకొని విశ్వనాథ ఇలా అంటారు.

ఒకదాని కొక్కటి లంగరందక యున్నది స్వామి
యకృత శశిజ్యోత్స్నయు నవకమ్ముమనునైన నీ వెల్గు
నకు, నెండలకు నెండి మోటు తేరిన నా దిషణ, కల
యిక కల్గ వేములవాడ రాజరాజేశ్వరా! స్వామి!

(విశ్వనాథ, వేములవాడ శతకం, పద్యం : 28)

దివ్య సౌందర్యము నియతికృత నియమ రహితమైనది. హ్లాదైక మయమైనది. కావ్య సౌందర్యము వృత్తి రీతి శయ్య అర్థ లక్షణ రస భావ ఔచిత్య ధ్వన్యాదులకు సంబంధించిన నియమ నిబంధనల ననుసరించడం వల్ల రాణిస్తుంది. ఈ భేదాన్ని దృష్టిలో ఉంచుకొనే దైవీయమైన సౌందర్యంలో ఉండే నవకం, వెన్నెల నతిశయించే వెలుగు, ఎండలకు ఎండి మోటు దేరిన తన దిషణకు ఒక సమన్వయాన్ని సాధించడానికి తాను చేసే ప్రయత్నం సులభ సాధ్యంగా లేదని విశ్వనాథ వ్యథ చెందారు. సాహిత్య సౌందర్య సాధకు లందరికీ ఈ తపన తప్పదు. కొందరికి తపన మాత్రమే మిగిలిపోయింది. కొందరు తపించి తపించి సౌందర్య సిద్ధు లౌతారు.

జాతికి సౌందర్య భిక్ష పెట్టే కవి ముందుగా సౌందర్య జ్ఞానాన్ని పొంది ఆ జ్ఞానం ద్వారా సౌందర్యానుభవాన్ని పొంది ఉండాలి. సమస్త ప్రకృతిలోను ఉండే సౌందర్యంతో పాటు హృదయంలో ఉండే సౌందర్యాన్ని కూడా దర్శించి అతడు తన జాతికి అందించగలగాలి. కావ్యంలో కథ, పాత్రలు వంటివన్నీ ప్రమిద వంటివైతే ఆ ప్రమిదను ఆశ్రయించుకొని వెలిగే దీపం సౌందర్యం. "ఆ దీపం కోసం ఈ ప్రమిదను గూడ గట్టిదిగా చూసుకొంటాం. అంతే గానీ దీపం మాట విస్మరించి ప్రమిదలనే అలంకరిస్తూ కూచోటం సాహిత్యం అంటే సమ్యక్ దృష్టి లేక పోవడమే" అంటారు జరూక్ శాస్త్రి. "కావ్య పాఠకులు సౌందర్యానుభవం ద్వారా సంఘంలోను, సర్వేశ్వరుని ముందు ఒక యోగ్యతను సాధించడానికి కవి అవసరం ఎంతైనా ఉంది," అని కూడా వారన్నారు.[21] ఈ విధమైన యోగ్యతను తన రచనల ద్వారా అందించడానికి విశ్వనాథ తనకు గల సౌందర్య జ్ఞానాన్ని ఉపయోగించారు.

నేను జ్ఞాత శిల్పిని. నా కావ్యంలో నాకే తెలియని అందాలెన్నో ఉంటాయి. వాటిని తెలుసుకొని అందరికీ వెల్లడి చేయగల పండితులుంటారని నేననుకోను, ప్రజలు నా కవిత్వాన్నీ, అందులోని కళామర్మాన్నీ తెలుసుకోలేరనీ, నేను వచనంలో రాస్తే వారు చాలా వరకు అర్థం చేసుకోగలరని నేను అనుకొంటాను. నేను ధార్మిక లక్ష్యంతో రాస్తాననీ, నా రచనలకు భవ్యావేశం లేదని నా శత్రువులంటారు, అని విశ్వనాథ చెప్పారు. (My Self - My Work, పుట :59) భవ్యావేశం లేని సౌందర్య జ్ఞానమంటూ ఉండదు. సౌందర్య జ్ఞానానికి, దర్శనానికి, అనుభవానికి, సృష్టికి అది మూలం. కవి భవ్యావేశంతో రాస్తున్నాడా! కేవలం ఒక వ్యవస్థను కాపాడడానికి సౌందర్యాన్న పేక్షితమైన మార్గంలో రాస్తున్నాడా! అనేది నిర్ణయించడం సహృదయులకే సాధ్యం. రాగ ద్వేషాలతో అభిప్రాయ ప్రకటన చేసేవారికి ఇది సాధ్యపడదు. పూర్వ కావ్యాలన్నింటినీ చదివి సర్వకాల సర్వావస్థల లోను వాటిని మననం చేసుకోవడం వల్ల సారస్వత సౌందర్యాన్ని గ్రహించిన వారు సహృదయులు. "ఒక సానుభూతితో కావ్యం చదవాలి. పూర్వ కవుల సుచరిత పథాలని జాగ్రత్తగా పరిశీలించాలి. సౌందర్యమన్నది భావంలోనే ఉండనక్కర్లేదు. ఒక వృత్త భేదంలో, ఒక చిన్న సమాసంలో, సుడి కారంలో, కూర్పులో, ఒక చిన్న మాటలో ఉండవచ్చు. పఠిత జాగ్రత్తగా ఉండకపోతే ఇటువంటి సౌందర్యాలు గ్రహించలేక పోతాడు.[22] అన్నారు విశ్వనాథ తన శత్రువులకు పూర్వ సాహిత్య పఠనము, మననము ఉన్నా తన రచనల పట్ల సానుభూతి లేకపోవడమే పై విమర్శకు కారణమని విశ్వనాథ అభిప్రాయ పడినట్లు కనిపిస్తుంది. ఆయన శత్రువులు ఆయన రచనలలోని వస్తు పక్షాన్ని, సిద్ధాంత పక్షాన్ని దర్శించగలిగారు గానీ సౌందర్య మూలకమైన కళా పక్షాన్ని విస్మరించారని ఆయన భావన. పాండిత్యమంటే కేవలం తర్క కర్కశమైన శాస్త్ర బుద్ధి మాత్రమే కాదని, సహృదయత్వమే పాండిత్యమని విశ్వనాథ భావించారు. పూర్వ సాహిత్య పఠన మననాదుల

కారణంగా మాత్రమే సహృదయుడు కాలేడని అందుకు పరమేశ్వర దత్తమైన ఒక రమణీయతా పరిజ్ఞానము కూడా అవసరమని విశ్వనాథ నొక్కి చెప్పారు.[23] అంటే సౌందర్య జ్ఞానానికి కేవల సానుభూతి మాత్రమే చాలదని, హృదయ సంవాదంతో పాటు రమణీయతా పరిజ్ఞానాన్ని అందించగల దైవకృప కూడా అవసరమనీ, ఈ రెండూ ఎవరిలో ఉంటాయో వారే కావ్య సౌందర్యాన్ని గ్రహించగలరని వివరించినట్లు అయింది.

కవిత్వ సౌందర్యజ్ఞానం పట్ల అరవిందుని వంటి తాత్త్వికులు, విశ్వనాథ వంటి కవులు కొన్ని విషయాలలో ఏకాభిప్రాయాన్ని కలిగి ఉన్నారు. ఇందుకు వారి ఆధ్యాత్మిక దృష్టి కారణమయింది. కవితా సౌందర్యపు విలువ లేదా కవితా సౌష్ఠవం అది ఉత్పన్నమైన స్థాయిపై ఆధారపడదు. మూలం ఏదైనా ఏ దాగునిక గాఢత, ప్రేరణలతో ఉత్పన్నమైన కవిత్వం ఎంత శక్తితో, సాధికారతతో, స్వచ్ఛతతో లిఖితమైనదనే దానిపైన ఆధారపడుతుంది. అధి మనస్సు (Super Mind) ఆధ్యాత్మికశక్తి అనక తప్పదు. దానిలో గల మనస్సు తన సామాన్యమైన సత్యం కోల్పోయి ఉన్నతిని పొంది ఆధ్యాత్మికమైన పునాదిపై స్వీయ మార్గాన్ని నిర్దేశించుకుంటుంది. సౌందర్య పరిష్వంగంలో అది ఉదాత్తమౌతుంది. అవశ్యంభావియైన ఆ సౌందర్యాత్మకత నియమ నిబంధనల కతీతమైనది. విశ్వవ్యాప్తమై అనాదియైన సౌందర్యాన్ని అది దర్శిస్తుంది. దాన్ని గ్రహించి నిర్దిష్టమూ, పరిమితమూ అయిన దాన్ని రూపాంతరం చెందిస్తుంది. భౌతిక సౌందర్యం లేదా కళాత్మక సౌందర్యంతో గల వస్తువులతో దానికి ప్రమేయం లేదు, అంటారు అరవిందులు.[24] కవిత్వానికి జన్మస్థానం మనస్సు అని విశ్వనాథ ప్రకటించారు. కవిత్వ సౌందర్యపు విలువ లౌకికమైన ఆ మనస్సులో కాక అధిమనస్సు నుండి జనించేదిగా ఉంటుందనే అరవిందుని భావనతో విశ్వనాథ సహమతిని కలిగి ఉన్నారు. "మహాకవియందున్న కవితాశక్తి పరమేశ్వరాంశ" అన్న విశ్వనాథ మాటలలోని అంతరార్థ మిదే.[25] కాళిదాసు వంటి ప్రాచ్యకవులలోను, షేక్స్పియరు వంటి పాశ్చాత్య కవులలోను ఈ పరమేశ్వరాంశ ప్రదీప్తమై వారు గ్రహించిన వస్తువు, రస సంధాన నైపుణ్యాము, రచనా శిల్ప సామర్థ్యము, వ్యంగ్య వైభవము, వక్రక్తి నైపుణ్యాము, అలంకార సంగ్రహణ దక్షత, ఔచిత్య నేతృత్వము వంటి లక్షణాల నాశ్రయించి ఉండే భౌతిక సౌందర్య లక్షణాలకు అతీతమైన ఒక పరమ సత్య దర్శనాన్ని, ఆధ్యాత్మిక స్ఫురణను కలిగించే అధిమానసిక వ్యాపార మొకటి అందులో చేరి దానిలో సార్వజనీన, సార్వ కాలిక శోభా సంపత్తిని నింపుతుందని అందుకే ఏ దేశపు కవినైనా అన్ని దేశాల పాఠకులు చదివి ఆనందించ గలుగుతున్నారని విశ్వనాథ అభిప్రాయ పడ్డారు.

***అథ స్సూచికలు:***

1. "Beauty is truth, that it is the expression of the ideal, the symbol of divine perfection and the sensible menifestation of the good." George Santayana, The Sence of Beauty, The Modern Library, New York, 1955, P : 19
2. విశ్వనాథ 'మనో' సంచారం, విశ్వనాథ ఆర్.ఎస్. సుదర్శనం, వసుంధరా దేవి గార్లతో జరిపిన ఇంటర్వ్యూ, విశ్వనాథ అసంకలిత సాహిత్యం – 2, పుట : 224.
3. విశ్వనాథ, సాహిత్య సురభి, 1969, పుట : 8.

4. వడలి మందేశ్వర రావు, ఇది కల్పవృక్షం, 1985, పుటలు : 346, 47.

5. విశ్వనాథ, సాహిత్య సురభి, 1969, పుట : 8.

6. Ibid, P : 166.

7. విశ్వనాథ, కులస్వామి శతకము.

8. Chapter II, Section I, Ruskin's Rufutation of "False Opinions Held Concerning Beaty", The Victorian Web - John Ruskin downloaded from Net.

9. Ibid, PP : 45 to 51.

10. విశ్వనాథ, కావ్య పరీమళము, శ్రీకాళహస్తి మహాత్మ్యము, పుట : 190, ఆం.ప్ర. సాహిత్య అకాడమీ, మే 1970.

11. విశ్వనాథ, వేములవాడ శతకము, పద్యం : 68.

12. "భార్య యన్న యొకట స్త్రీ. ఆమెకు శరీరమున్నది. ఆ సాధనము పృథివీమయమైన ప్రపంచము నందున్నది. ఆ భార్యారూప మెంత రమణీయముగా నున్నదో యీ శబ్దమునంత రమణీయముగా నున్నది. అది కనిపించును. ఇది వినిపించుచున్నది" — విశ్వనాథ, మ్రోయుతుమ్మెద, పు : 167.

13. Ibid పుట : 183.

14. Ibid పుట : 189.

15. విశ్వనాథ, కల్పవృక్ష రహస్యాలు, పుట : 55.

16. Aesthetic Qualities, Oswald Hanfling, Philosophical Aesthetic - An Intruoduction, 1992 U.K, P : 46,48.

17. Ibid

18. విశ్వనాథ, వేయిపడగలు, పుట : 821.

19. Robvan Gerwen, Kant's Regulative Principle of Aesthetic Excellence, The Ideal Aesthetic experience, Encylopaedia Britanica.

20. వాల్మీకి రామాయణం, అరణ్యకాండ, 17వ సర్గ, 10,11,12 శ్లోకాలు.

21. జలసూత్రం, అఖండ ప్రతిభా సంపన్నులు - శ్రీ విశ్వనాథ సత్య నారాయణగారు.


22. విశ్వనాథ, "ఎట్టిన శిల్పము" విశ్వనాథ అసంకలిత సాహిత్యం-2, ఉపన్యాసాలు-ఇంటర్వ్యూలు : 1996.

23. విశ్వనాథ, 'సాహిత్య భావుకత', విశ్వనాథ అసంకలిత సాహిత్యం - 4, రూపకాలు-సంపాదకీయాలు, పుట : 227.

24. H.D. Sethna, Overhead Poetry, P : 50.


25. జయంతి, అక్టోబరు, 1959, పుట : 232.

(సమాప్తం)



Small dream in red (1924)

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD-191/2006-08



రష్యన్ తరుణి అందాలు- 1905